# మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
సోమవారం
30-09-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 280
పేజీలు : 8

Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam | Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa




మోదీని గద్దె దించే వరకు
## చావను
ఖర్గేకి అస్వస్థత

ప్రసంగిస్తూ స్పృహ కోల్పోయిన ఖర్గే..

ఖర్గే ఆరోగ్యంపై ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆరా

ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు వెల్లడి

వివరాలు 7లో



నెరవేర్చలేని వాగ్దానాన్ని
## బీజేపీ చేయదు
హెచ్‌పీ, కర్ణాటకల్లో రాహుల్ హామీల అమలు పూజ్యం

కాంగ్రెస్‌పై అమిత్ షా విమర్శలు

మేము దేశ సరిహద్దును కాపాడతాం

గురుగ్రామ్ ఎన్నికల ర్యాలీలో అమిత్ షా

వివరాలు 7లో

## మనం మిత్రులను మార్చగలం కానీ..
పొరుగువారిని మార్చలేం



అలా చేసుంటే.. పాక్‌కు పెద్ద ఆర్థిక ప్యాకేజీ ఇచ్చేవాళ్లం

రాజ్‌నాథ్ సింగ్

వివరాలు 7లో




# ఆరోగ్యమే సంపద



మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

మహిళల ఆరోగ్యమే కుటుంబాలకు బలం

సమాజ శ్రేయస్సుకు అదే పునాది

మహిళల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం కోసం మరిన్ని ఆసుపత్రులు నిర్మిస్తాం

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహించాం

'పింక్ పవర్ రన్'లో సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 2లో..

# జనానికి సంకలనాత్మక కథనాలే ఇష్టం



వారికి స్ఫూర్తిదాయక, ప్రోత్సాహక సమాచారం కావాలి : ప్రధాని

పదేళ్ల మన్ కీ బాత్‌పై మోదీ భావోద్వేగం

తల్లి పేరిట మొక్క.. యూపీలో 26 కోట్లు, గుజరాత్‌లో 15 కోట్ల మొక్కలు నాటాం

మొక్కలు నాటడంలో రాష్ట్ర ప్రజల చొరవ అభినందనీయం

'ఏక్ పేడ్.. మా కే నామ్' లక్ష్యాన్ని మించారు

'మన్ కీ బాత్'లో ప్రధాని అభినందనలు

నాలుగేళ్లుగా ప్రతిరోజూ ఓ మొక్క నాటిన కేవన్ రాజశేఖర్‌పై ప్రధాని ప్రశంసలు

పండుగల సందర్భంగా మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తులను కొనుగోలు చేయాలి

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

వివరాలు 7లో

## పేదోళ్లను అడ్డుపెట్టి బిల్డర్ల వ్యాపారం



నదీ గర్భంలోనూ ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు

వీటిని ఆపకుంటే భవిష్యత్తు తరాలకు ప్రమాదం

తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టండి

అమెరికాలో తెలుగు కమ్యూనిటీ మీట్ అండ్ గ్రీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు 2లో

## మూసీ బాధితులను ఆదుకుంటాం



పేదలను నిలబెట్టడమే మా ఉద్దేశం

మూసీలో నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం

దీనిపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు

మల్లన్నసాగర్‌లో వారేం చేశారు?: శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్):** పేదలను నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వం ఉద్దేశమని, పడగొట్టాలని కాదని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మూసీ రివర్‌బెడ్‌లోని అక్రమ నిర్మాణాలను మాత్రమే తొలగిస్తున్నామని.. నిర్వాసితులకు న్యాయం చేసే బాధ్యత తమదని, వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించనున్నామని ఆయన వెల్లడించారు. భూనిర్వాసితులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు బీఆర్ఎస్ ప్రభుత్వం.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వకుండా కొత్త జీవోను మిగతా 2లో...

సామాన్యులకు మేలు చేసేలా
# కొత్త చట్టం



ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి.. కబ్జాలకు అవకాశమివ్వొద్దు

జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకున్నాకే తహసీల్దార్లపై కేసులు!

రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ కేంద్రం

తహసీల్దార్లతో సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్):** రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నట్లు ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది, రెవెన్యూ శాఖను బలోపేతం చేస్తామని తెలిపారు. సామాన్యులకు, రైతులకు మేలు జరిగేలా కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో ఆదివారం 33 జిల్లాల తహసీల్దార్లతో మంత్రి శ్రీనివాసరెడ్డి మిగతా 2లో...



## మంత్రి ఉత్తమ్‌కు పితృ వియోగం
నివాళులర్పించిన సీఎం రేవంత్, మంత్రులు, వివిధ పార్టీల నేతలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తంరెడ్డి(90) అనారోగ్యంతో తుదిశ్వాస మిగతా 2లో...

# మీకు అండగా ఉంటాం

కొడంగల్‌లో రేవంత్ ఇల్లు రెడ్డికుంటలో ఉంది.. దాన్ని కూలుస్తారా? అని నిలదీత

ఒక్క కాల్ చేయండి.. అరగంటలో వచ్చేస్తాం

'మూసీ' నిర్వాసితులకు మాజీ మంత్రి హరీశ్ భరోసా



**హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్):** ప్రజలు ధైర్యంగా ఉండాలని, ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్ తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటాయని, ప్రజలు ఎప్పుడైనా వచ్చి సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. ఇకపై ప్రజల ఇళ్లను రేవంత్ సేన ముట్టుకోకుండా తాము అండగా ఉంటామని, ఫోన్ చేస్తే అరగంటలో వస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల ఇళ్లు కూలగొట్టాలంటే బుల్డోజర్లు ముందుగా తమను దాటి రావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గండిపేట మండలంలోని హైదర్షాకోట్, లంగర్‌హౌజ్‌లోని హాసీంనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సన్సిటీలో ఆదివారం ఆయన మిగతా 2లో...

# జమిలిపై ముందుకే!

పార్లమెంటులో 3 బిల్లులు పెట్టనున్న కేంద్రం

వీటిలో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు

మొదటి దాంతో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు.. రాష్ట్రాల ఆమోదం అక్కర్లే

రెండో రాజ్యాంగ సవరణ స్థానిక ఎన్నికలపై..

ఎస్ఈసీలతో సంప్రదించి ఒకే ఓటరు జాబితా

దీనిని కనీసం సగం రాష్ట్రాలు ఆమోదించాలి



వివరాలు 7లో..

మనం





# ఆరోగ్యమే సంపద

హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించిన 'పింక్ పవర్ రన్'లో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ పరుగులో విజేతలను సీఎం రేవంత్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సంఘీభావంగా నగరవాసులు పింక్ పవర్ రన్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళల కోసం మరిన్ని ఆస్పత్రులను నిర్మించనున్నట్లు తెలిపారు. మహిళా సంక్షేమం, ఆరోగ్యానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఈ సందర్భంగా మేఘా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే సంపద అన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహించామని, భవిష్యత్‌లో ఈ తరహా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి 3, 5, 10 కిలోమీటర్ల విభాగాల్లో ఈ రన్ నిర్వహించారు. విద్యార్థులు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ఔత్సాహికులు.. దాదాపు 12 వేల మంది ఈ పరుగులో పాల్గొన్నారు. రన్‌లో భాగంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్ రికార్డ్స్‌లో చోటు సంపాదించేందుకు పక్షి ఆకారంలో అతి పెద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రాజీనామా చేయక తప్పదు..

### లీగల్ నోటీసులిస్తే.. ఇల్లీగల్ దందాలపై మాట్లాడకుండా ఉంటానా?: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్): దేశంలో న్యాయవ్యవస్థ బలంగా, నిజాయితీగా ఉంది. ఆదర్శ్ కుంభకోణంలో అశోక్చ వాన్లాగా, నువ్ అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికావు. సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయక తప్పదు అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా హెచ్చరించారు. 'మీ బావమరిదితో లీగల్ నోటీసు పంపితే నీ ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడకుండా ఉంటాననుకుంటున్నావా? బావమరిదికి అమృతాన్ని పంచి, పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకోబోం' అని పేర్కొన్నారు. సీఎంపరిధిలోని శాఖలోనే తన బావమరిదికి కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్ కట్ట బెట్టింది నిజమని తెలిపారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్7, 11, 13ను ముఖ్యమంత్రి ఉల్లంఘించారని. గత రెండేళ్లుగా రూ.2కోట్లు లాభం ఆర్జించిన ఒక చిన్న కంపెనీ అంతపెద్ద టెండరు కట్టబెట్టారని, ఈ అవినీతి నుంచి ఢిల్లీలో ఉన్న రేవంత్ బీజేపీ దోస్తులు కూడా ఆయనను కాపాడడం కష్టమేనన్నారు. నగరంలో నీ రూ.1.50 లక్షల కోట్ల మూసీ ధనదాహానికి బలవుతున్న జీవితాలు లక్షల్లో ఉన్నాయి మిస్టర్ చీఫ్ మినిస్టర్ అంటూ విమర్శించారు. 'మహానగర ప్రజలారా అధైర్యపడొద్దు.. మీకు మద్దతుగా బీఆర్‌ఎస్ ఉంటుంది' అని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

# హైడ్రా.. ఆచితూచి!

### హైదరాబాద్‌లో కూల్చివేతలకు 2-3 వారాల తాత్కాలిక విరామం?
### నిరసనలు, హైకోర్టు జోక్యంతో ఆదేశాలు
### ఈ సమయంలో ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన
### ఇక ముందు నివాసాల కూల్చివేతపై జాగ్రత్తలు
### న్యాయ సలహా తీసుకున్నాకే ముందుకు



హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్): ఓ వైపు మూసీ ఆక్రమణల మార్కింగ్.. మరోవైపు చెరువులు, ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాల కూల్చివేత.. వాటిని వ్యతిరేకిస్తూ బాధితుల నుంచి నిరసనలు పెరిగిపోవటం, బాధితుల ఆక్రందనలు సోషల్ మీడియాలో వైరల్ కావటం.. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విభాగాలు పునరాలోచనలో పడ్డాయి. క్షేత్రస్థాయి సర్వే, మార్కింగ్లను రెవెన్యూ విభాగం ఇప్పటికే నిలిపివేయగా.. చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోన్న 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్' (హైడ్రా) తాత్కాలికంగా కూల్చివేతలకు విరామం ప్రకటించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ విరామం సమయంలో ఫిర్యాదులపై సమగ్ర పరిశీలన చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఎఫ్టీఎల్, బఫర్జోన్ నోటిఫై అయిన చెరువులకు సంబంధించిన ఫిర్యాదులపై దృష్టి సారించనున్నారు. నిర్ధారిత ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో క్షేత్రస్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అదే సమయంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, స్థానిక మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల అనుమతులున్న నిర్మాణాల కూల్చివేతల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని భావిస్తున్నారు. కాగా, హైకోర్టు కూడా పలుమార్లు హైడ్రా దూకుడును ప్రశ్నించింది. కోర్టు విచారణలో ఉన్న ఓ భవనాన్ని కూల్చివేయడంపై తీవ్రంగా స్పందించింది. స్వయంగా లేదా వర్చువల్‌గా హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహసీల్దార్ విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఇది కూడా హైడ్రా పునరాలోచనకు ఓ కారణంగా తెలుస్తోంది. వాస్తవానికి, జూలై 19వ తేదీన ఏర్పాటైన హైడ్రా తొలి నుంచి దూకుడుగానే ఉంది. చెరువులు, పార్కుల్లోని నివాసేతర నిర్మాణాల కూల్చివేత చేపట్టగా మొదట్లో ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చింది. అయితే పేదలు నివాసం ఉంటున్న షెడ్లు, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసిన నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను కూల్చివేయడం మొదలు కావటంతో ప్రతికూల వాతావరణం నెలకొంది. నిజాంపేటలోని మల్లంపేట కత్వ చెరువు, అమీన్పూర్లోని ప్రభుత్వ స్థలంలో విల్లాల కూల్చివేతపై విమర్శలు వ్యక్తమయ్యాయి. కత్వ చెరువులో నిబంధనలకు విరుద్ధంగా స్థానిక సంస్థ అనుమతులివ్వగా.. కొన్ని విల్లాల విక్రయం అనంతరం పర్మిషన్లు రద్దు చేశారు. తెలిసీ తెలియక విల్లాలు కొన్న వారిలో ఎక్కువ మంది మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతికి చెందిన వారే. అమీన్పూర్లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన 25 విల్లాలను హైడ్రా నేలమట్టం చేసింది. ఇక్కడ కూడా సర్కారు భూమిలో మునిసిపాలిటీ అనుమతులు ఇవ్వగా.. రెవెన్యూ విభాగం సూచనతో అనంతరం రద్దు చేశారు. అందుకే నిర్మాణాలను కూల్చివేసినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే, నిర్మాణాలు చేపట్టి విక్రయించిన వాళ్లు, అనుమతులు ఇచ్చిన అధికారులు ఆర్థిక ప్రయోజనం పొందగా.. కొనుగోలు చేసిన వారు బాధితులుగా మిగిలిపోయారు. సున్నం చెరువు వద్ద ఆక్రమణల తొలగింపు క్రమంలోనూ హైడ్రా తీరు చర్చనీయాంశంగా మారింది. మంచినీటి వ్యాపారం చేసే ఓ వ్యక్తి కూలీల కోసం నిర్మించిన షెడ్లు తొలగించామని హైడ్రా చెబుతున్నా.. కూల్చివేతల అనంతరం, పిల్లాపాపలున్న ఆ కుటుంబాలు ఎక్కడ తలదాచుకుంటాయన్న విషయాన్ని అధికారులు పట్టించుకోలేదు. కూకట్పల్లిలోని చెరువు వద్ద నిర్మించిన షెడ్లను వాటిలో ప్రింటింగ్, క్యాటరింగ్ యంత్రాలుండగానే కూల్చడంపైనా విమర్శలు వ్యక్తమయ్యాయి. బాధిత కుటుంబాలు రోదిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మరోవైపు, మూసీ తీర ప్రాంతంలో ఇళ్లకు మార్కింగ్ చేసిన రెవెన్యూ, ఇతర విభాగాల అధికారులు.. హైడ్రా కూల్చివేతలు చేపట్టనుందని, త్వరగా ఖాళీ చేయాలని ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి సూచించారు. దీంతో, హైడ్రా బుల్డోజర్లు ఎప్పుడు వస్తాయో అన్న ఆందోళన బాధిత కుటుంబాల్లో కనిపిస్తోంది. కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నామని పలువురు వాపోతున్నారు.

### హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు : రంగనాథ్



హైడ్రాపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తూ అప్రతిష్ఠపాలు చేయాలని ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సంస్థ కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. సంబంధం లేని విషయాలను సంస్థకు ఆపాదిస్తూ కొంతమంది ఉద్దేశపూర్వకంగా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డిలోని మల్కాపూర్ చెరువులో కూల్చివేతలు హైడ్రా చేపట్టలేదని స్పష్టం చేశారు. అక్కడ జరిగిన ప్రమాదంలో హోంగార్డుకు గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని, దానికి హైడ్రా బలి తీసుకుందని ప్రచారం చేస్తుండడం దురదృష్టకరమన్నారు. కూకట్‌పల్లిలో ఎవరికీ నోటీసులు ఇవ్వలేదని, బుచ్చమ్మ ఆత్మహత్యను హైడ్రాకు ముడిపెట్టవద్దన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూల్చివేతలు జరిగినా హైడ్రాకు ఆపాదిస్తున్నారని, ఆదిలాబాద్ జిల్లాలో కూల్చివేతలు చేసినట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు మాత్రమే హైడ్రా పరిధిలోకి వస్తుందని గుర్తుచేశారు.

#### ఉన్నత స్థాయి ఆదేశాల నేపథ్యంలో..

తాజా పరిణామాల నేపథ్యంలో స్పీడ్ తగ్గించాలని హైడ్రాకు ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు అందినట్టు తెలిసింది. ఫలితంగా.. రెండు, మూడు వారాలపాటు హైడ్రా కూల్చివేతలు ఉండకపోవచ్చని సమాచారం. ఆ తర్వాత కూడా నివాసేతర ఆక్రమణల తొలగింపునకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. వీలైనంత వరకూ నివాస భవనాల జోలికి వెళ్లకుండా ఉండాలనుకున్నట్టు తెలిసింది. తప్పదనుకుంటే న్యాయ సలహాలు తీసుకున్న తరువాతే ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.

## నేడు రైతు హామీల సాధన దీక్ష

### రైతులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ప్రధాన లక్ష్యం : ఈటల

హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్): రైతులందరికీ సమగ్రంగా రుణమాఫీ అమలు చేయాలన్న డిమాండ్‌తో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో దీక్ష చేపడుతున్నామని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఇందిరా పార్కు సమీపంలోని ధర్నాచౌక్లో నేడు ఉదయం 11 గంటల నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు రైతు హామీల సాధన దీక్ష ఉంటుందని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని వివరించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తుంటే ప్రభుత్వం రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేసే అవకాశం లేదన్నారు. రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, సన్న వడ్లకు రూ.500 బోనస్, కౌలు రైతులకు రైతుబంధు, రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయ కులు.. ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అరాచక పాలన చేస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. లక్షలాది మంది రైతులను ప్రభుత్వం మోసం చేసిందని.. దానికి నిరసనగా దీక్ష చేపడు తున్నామని తెలిపారు. రైతులందరికీ రుణమాఫీ సమగ్రంగా అమలు చేసేవరకూ పోరాటం చేస్తామని ప్రకటించారు.

## కేంద్రం సాయపడ్డంలేదు : మమతా

కోల్ కతా: పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర జిల్లాల్లో వరద పరిస్థితి ఘోరంగా ఉంది, కేంద్రం ప్రకృతి విపత్తు సాయం కూడా అందించడంలేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. వరద ప్రాంతంలో యుద్ధ ప్రాతిపదికన సాయం అందిస్తున్నామని ఆమె విలేకరులతో అన్నారు. పశ్చిమ బెంగాల్ లోని కూచ్ బీహార్, జల్పాయ్ గురి, అలిపురుద్వార్ వరదలకు చాలా దెబ్బతిన్నాయి. కోశీ నది క్యాచ్ మెంట్ ఏరియాల్లో కురిసిన భారీ వర్షానికి బీహార్, మాల్దా, దక్షిణ్ దినాజ్ పుర్ జిల్లాలు బాగా ప్రభావితం అయ్యాయి. భవిష్యత్తులో మరింత ప్రభావి తం కావొచ్చని సిల్ గురికి వెళుతూ మమతా బెనర్జీ తెలిపారు. ప్రకృతి విపత్తును ఎదర్కొనడంలో కేంద్రం సాయం అందించడంలేదన్నారు. ఫరక్కా బ్యారేజ్ నిర్వహణ పనులను కూడా కేంద్రం చేపట్టడంలేద న్నారు. పైగా ఆ బ్యారేజ్ నిల్వ స్థాయి బాగా తగ్గిపోయిందని తెలిపారు.

### సామాన్యులకు మేలు చేసేలా
# కొత్త చట్టం

మొదటి పేజీతరువాయి...

ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులు, అధికారులు జోడెడ్ల వంటి వారని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులు, స్థలా లను కాపాడడంతోపాటు పేదలకు సహాయం అందించడంలో రెవెన్యూ యంత్రాంగం పనితీరు మెరుగుపడాలని సూచించారు. ఒక్క అంగుళం ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణలకు గురి కాకుండా చూడాలన్నారు. ఇందుకోసం పటిష్ఠ కార్యాచరణను రూపొందించాలని ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది పూర్తిగా సహకరించాలి, వారి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి పథకాలను అందించడంలోనూ రెవెన్యూ యంత్రాంగం కీలక పాత్ర పోషించాలన్నారు. అందులో తహసీల్దా ర్ల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య రెవెన్యూ శాఖ వారధిగా ఉండాలని, ఈ విభాగం సమర్థంగా పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు, ఆకాంక్షలు నెరవేరతా యని తెలిపారు. ప్రజలు కోరుకుంటున్నట్లుగా రెవెన్యూ వ్యవస్థ పనిచేస్తుందా, లేదా? అని ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే రైతులు, పేదలు, సామాన్యులకు వీలైనంత మేరకు సాయం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రెవెన్యూ శాఖలో ఎంత నిజాయితీగా పనిచేసినా నిందలు తప్పవని, మన అంతరాత్మ సాక్షిగా పనులు చేయాలని సూచించారు. కలెక్టర్ అనుమతి తీసుకున్న తర్వాతే తహసీల్దార్ల మీద కేసులు నమోదు చేసేలా డీజీపీతో చర్చించి త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. అలాగే రెవెన్యూ సిబ్బంది కోసం హైదరాబాద్లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం హడావుడిగా మండలాల సంఖ్యను పెంచింది కానీ, దానికి తగినట్టుగా కార్యాలయాలను, మౌలిక వసతులను ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. అవసరమైన మేరకు సిబ్బందిని కూడా నియమించలేదన్నారు. తహసీల్దారు కార్యాలయాల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు రెగ్యులర్ స్టాఫ్ నియామకం, పదోన్నతులు, కోర్టు ఖర్చులు, అద్దె భవనాలు, అద్దె వాహన బకాయిలతో పాటు అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో జరిగిన తహసీల్దార్ల బదిలీలపై ఉద్యోగ సంఘాలతో చర్చించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.

#### 28 ఏళ్ల సర్వీసులో ఇలాంటి కార్యక్రమం చూడలేదు: నవీన్ మిట్టల్

తన 28 ఏళ్ల సర్వీసులో రెవెన్యూ మంత్రి తహసీల్దార్లతో ముఖాముఖిగా మాట్లాడడం ఇదే తొలిసారి అని ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఏ శాఖలు చేయలేని పనులను రెవెన్యూ శాఖ చేస్తుందని చెప్పారు. రెవెన్యూ అధికారుల సమస్యలను వినడానికి, తగురీతిలో పరిష్కరించడానికి మంత్రి రావడం హర్షణీయమని తెలిపారు.

# మూసీ బాధితులను ఆదుకుంటాం

మొదటి పేజీతరువాయి...

తేవడంతో.. అప్పట్లో మల్లారెడ్డి అనే రైతు చితి పెట్టుకుని ఆహుతయ్యాడని గుర్తుచేశారు. సీఎల్పీ మీడియా హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతోనే చెరువుల్లో, మూసీ నదిలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. మూసీ నదిలో గోదావరి నీళ్లను ప్రవహింపజేసి నదికి ఇరువైపులా రోడ్లు వేస్తామన్నారు. మూసీపైన ఫ్లై ఓవర్లు, పీపీపీ పద్ధతిలో నిర్మాణాలూ ఉంటాయని చెప్పారు. 'వాక్ టు వర్క్' పద్ధతిలో ఉపాధినీ కల్పిస్తామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయం చూపిస్తున్నామని, దీనికి సంబంధించి 12 ఎన్జీవోల ప్రతినిధులతో సంప్రదింపులూ చేస్తున్నామని చెప్పారు. సొంత ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. అంగన్ వాడీ కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తామని, వారి పిల్లలను ఆరేళ్ల పాటు చదివిస్తామని చెప్పారు. స్వయం సహాయక మహిళా గ్రూపుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇప్పిస్తామన్నారు. హైడ్రాతో పేదలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని.. బిల్డర్ల చేతిలో మోసపోయిన పేద, మధ్యతరగతి వారి నివాసాల విషయంలో ప్రభుత్వం తొందరపడబోదని, ఎవరూ ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. మూసీ, హైడ్రాల విషయంలో అనుమానాల నివృత్తి కోసం అన్ని కలెక్టరేట్లలో హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేస్తామన్నారు. మూసీ, హైడ్రాపై చట్టబద్ధంగా, ప్రణాళికాయుతంగా ముందుకు వెళుతున్నామని, నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు ఉంటాయని చెప్పారు. అపార్ట్మెంట్ నిర్వాసితులకు ఎలా న్యాయం చేయాలనే అంశంపై సీఎం రేవంత్ ఆలోచిస్తున్నారని.. బిల్డర్ల చేతిలో మోసపోయిన వారి విషయంలో ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తుందని వెల్లడించారు.

#### బ్లూ ప్రింట్ సిద్ధం..

మూసీ ప్రాజెక్టుకు సంబంధించి బ్లూ ప్రింట్ తయారైదని, పనులు పారదర్శకంగా జరుగుతాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మూసీ ప్రక్షాళన చేస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా చెప్పిందని, కానీ చేయలేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ పని తమ ప్రభుత్వం చేస్తుంటే ఆ పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. హైదరాబాద్ వాసులు మురికి కంపులోనే ఉండాలా అంటూ బీఆర్‌ఎస్ పార్టీని నిలదీశారు. 'బుల్డోజర్ పాలసీని అమలు చేసిందే బీఆర్ఎస్ ప్రభుత్వం. మా ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాలపైకే బుల్డోజర్ పోయింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులు, మల్లన్న సాగర్ నిర్వాసితులపైకి బుల్డోజర్లు పోయాయి. మేము ప్రజాస్వామ్యస్ఫూర్తితో వెళుతుంటే..బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు' అని ధ్వజమెత్తారు.

# మీకు అండగా ఉంటాం

మొదటి పేజీతరువాయి...

పర్యటించారు. మూసీ సుందరీకరణ నేపథ్యంలో నిర్వాసితులవుతున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రజల బాధలు చూస్తుంటే కన్నీళ్లు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ.. హస్తం గుర్తును తీసేసి.. బుల్డోజర్ గుర్తును పెట్టుకోవాలని సూచించారు. 'కొండగల్లోని సర్వే నంబర్ 30లో ఉన్న రెడ్డికుంటలో నువ్వు ఇల్లు కట్టుకున్నవ్.. ముందుగా దాన్ని కూలగొట్టు. ఎఫ్టీఎల్లో ఉన్న నీ తమ్ముడి ఇంటికి మాత్రం నోటీసులు ఇచ్చి వదిలేస్తావా? పేదల ఇళ్లు కూలగొడతావా? నీ తమ్ముడికో రూల్.. పేదలకో రూలా?' అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కూల్చడమే తప్పు.. ఏ ఒక్క భవనమూ కట్టింది లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మూసీ సుందరీకరణ మానుకోవాలని డిమాండ్ చేశారు.

#### మూసీకి నీళ్లెలా తెస్తారు?

కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించిన



రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మూసీలోకి తెస్తామనడం వింతగా ఉందని హరీశ్ పేర్కొన్నారు. గోదావరి నీళ్లను మూసీలోకి తెస్తే.. కాళేశ్వరంపై సీఎం చేసిన వ్యాఖ్యలు అబద్ధమే కదా? అని అన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రజలను భయభ్రాంతులను చేయడం మానేసి, మూసీలోకి మురికి నీరు రాకుండా చెయ్యాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో 32 ఎస్టీపీలు ఏర్పాటు చేశామని, మురుగు నీరు మూసీలోకి రాకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. కానీ, సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని దుయ్యబట్టారు.

## మంత్రి ఉత్తమ్‌కు పితృ వియోగం

మొదటి పేజీతరువాయి...

విడిచారు. భార్య ఉషాదేవితో కలిసి మసీద్‌బండలోని సైబర్ మెడోస్‌లో కుమార్తె హితశ్రీరెడ్డి నివాసంలో ఉంటోన్న ఆయన ఆదివారం అస్వస్థతకు గురికావడంతో అపోలో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నేతలు ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మందకృష్ణ మాదిగ, ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, రవిచంద్ర, మాజీ మంత్రి హర్షీరావు, కేపీ వివేక్ తదితరులు నివాళులు అర్పించి సానుభూతిని తెలిపారు. అనంతరం రాయదుర్గంలోని మహాప్రస్థానంలో పురుషోత్తంరెడ్డి భౌతికకాయానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు, జీవన్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, వేం నరేందర్‌రెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తాటిపాములకు చెందిన నలమాద పురుషోత్తంరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రి కాగా, చిన్న కుమారుడు గౌతం రెడ్డి పారిశ్రామికవేత్త. కుమార్తె హితాశ్రీ గృహిణి. బీహెచ్ఈఎల్లో ఈడీగా పనిచేసిన ఆయన ఉద్యోగ విరమణ తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

మనం



# ఉద్యోగుల సమస్యల సాధనకు ఐక్యంగా ఉద్యమిస్తాం

- టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు



**నల్లగొండ, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** ఉద్యోగుల సమస్యల సాధనకు ఐక్యంగా ఉద్యమిస్తామని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం నల్గొండలోని జెడ్పీ సమావేశ మందిరంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న డిఏలు, నూతన పిఆర్సి, సిపిఎస్ రద్దు అంశాల పైన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అధికారుల సస్పెన్షన్ అంశం రాష్ట్రవ్యాప్తంగా అగ్గిరాజుకుందని తెలిపారు. కొంత మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల తీరుపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సిఎస్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూనే ఉద్యోగుల సమస్యల సాధనకు ఐక్యంగా పోరాడుతామన్నారు. అనంతరం జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షునిగా ముజుబుద్దిన్, జిల్లా అధ్యక్షునిగా మసక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా చరిత్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలరాజు రెడ్డి, జిల్లా కోశాధికారిగా సందీప్, అసోసియేట్ అధ్యక్షులుగా అమరేందర్ గౌడ్, ఇస్మాయిల్, వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా ఎన్ పరమేష్, ప్రసన్న కుమార్,లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టిజిఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ .సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు శ్యామ్, జడ్పీ సీఈవో ఎన్ ప్రేమ్ కరణ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆర్ శ్రీనివాసమూర్తి, సీనియర్ నాయకులు మోహన్ రావు, రాష్ట్ర నాయకులు బట్టు. గోపి,టీఎన్జీవోస్ మాజీ అధ్యక్షులు ఏడుదొడ్ల వెంకటరామిరెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి జె. శేఖర్ రెడ్డి, మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పు రాంబాబు,ఎన్నికల అధికారులు జి వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, టిజియోస్ జిల్లా ఉపాధ్యక్షులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలను ప్రజలలోకి తీసుకెళ్లాలి



**గుండాల, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** మహనీయులు మహాత్మా జ్యోతి రావు పూలే సావిత్రిబాయి పూలే ఆశయాలను నేటి యువత ప్రజలలోకి తీసుకెళ్లాలని విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ నల్ల సోమ మల్లయ్య అన్నారు. ఆదివారం రోజున మండల కేంద్రంలోని వాసవి గార్డెన్లో విగ్రహ నిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషిచేసిన జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే ఆశయాలను భావితరాలకు తెలియజేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అనంతరం విగ్రహ నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గడ్డమీద పండరి ఆలేరు నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరసరపు యాదగిరి హజ్ కమిటీ సభ్యుడు ఎండి షర్ఫుద్దీన్,కుసుమని హరిచంద్ర చిందం ప్రకాష్, నల్ల సుభాష్ ,చంద్ర మల్లికార్జున్ ,మద్యపురం రాజు, ఆవుల సురేందర్, దేవన బోయిన లింగయ్య, పొడిచేటి వెంకన్న ,కొనపర్తి భాస్కర్, సూదగాని రామచంద్రు దేవనబోయిన ఐలయ్య ,అన్నపర్తి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## పురుషోత్తం రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

**దేవరకొండ, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** ఇరిగేషన్ శాఖ మరియు సివిల్ సప్లై శాఖ మంత్రి వర్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తం రెడ్డి మరణించిన విషయం తెలుసుకొని నేడు హైదరాబాద్‌లో వారి స్వగృహంలో నలమాద పురుషోత్తం రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించి,వారి కుటుంబానికి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,వారి ఆత్మ శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. వారితో పాటు నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర రావు ,ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన విభాగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్షర ప్రతిభా పురస్కారం అందుకున్న కళాకారుడు సతీష్





**గరిడేపల్లి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్ ):** సూర్యాపేట జిల్లా కేంద్రం శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో అక్షర ఫౌండేషన్ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం శ్రీ లక్ష్మి గార్డెన్స్ లో రాష్ట్ర స్థాయి అక్షర ప్రతిభ పురస్కార ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు అమరవరపు సతీష్ సాంస్కృతిక విభాగంలో ఉత్తమ డప్పు కళాకారుడిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త మీలా వాస్ దేవ్, అక్షర ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ యాస రామ్ కుమార్ రెడ్డి ఫౌండేషన్ యాజమాన్యం చేతులు మీదుగా రాష్ట్ర స్థాయి ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు. డప్పు కళాకారుడు అమరవరపు సతీష్ అవార్డు పొందడం పట్ల కుటుం బ సభ్యులు,అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్,జానపద కళాకారులూ సంఘం జిల్లా అధ్యక్షులు గుండ్ల ఆంజనేయులు,టియస్ యస్ జిల్లా అధ్యక్షులు వెన్నెల నాగరాజు, బండారు వీరు నాయుడు, ఉప్పల నాగార్జున,సతీష్ డప్పు కళా బృందం సభ్యులు, గ్రామస్తులు సతీష్ కీ అభినందనలు తెలిపారు.

## ది ఇండియా సిమెంట్స్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు




**దామరచర్ల, సెప్టెంబర్ 30 (మనం న్యూస్) :** వాడపల్లి గ్రామంలో జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు ది ఇండియా సిమెంట్ లిమిటెడ్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నల్గొండ పట్టణం నుండి రివర్ నిమ్స్ హాస్పిటల్ వారిచే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ది ఇండియా సిమెంట్స్ పర్సనల్ మేనేజర్ మోజేష్ మాట్లాడుతూ గ్రామంలో సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించడం వలన పేద ప్రజలు కు లబ్ధి చేకూరుతుంది సుమారు 500 మందికి పైగా షుగర్, బీపీ, ఈసీజీ, రక్త పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు అందజేయడం జరిగింది అని తెలియజేశారు. అదేవిధంగా కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మాధురి స్త్రీల వైద్య నిపుణులు మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులు పట్ల జాగ్రత్తగా ఉండాలని వర్షం నీరు నిల్వ ఉంచకుండా తగు జాగ్రత్తలు పాటించాలని డెంగ్యూ ,మలేరియా, టైయిా పాడ్ వంటి వ్యాధులకు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వాడపల్లి ఎస్సై ఇరుగు రవి పాల్గొన్నారు గ్రామ పెద్దలు ఎండి యూసుఫ్, కొందుటి సిద్దయ్య, ఎల్ వి సత్యనారాయణ ,సైదయ్య, కోటేశ్వరరావు, రివర్స్ నిమ్స్ హాస్పిటల్ సిబ్బంది, ఇండియా సిమెంట్స్ హెచ్ ఆర్ మేనేజర్ శ్రీనుబాబు మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు.

## మార్క్సిజమే ప్రపంచ మానవాళికి మార్గదర్శకం

- జూలకంటి రంగన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ శాసనసభ్యులు మిర్యాలగూడ




**దామరచర్ల, సెప్టెంబర్ (మనం న్యూస్) :** ఆదివారం దామరచర్ల మండలంలో గాంధీనగర్ సిపిఎం పార్టీ శాఖ ఏడవ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగన్న గారు హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి మార్క్సిజం మాత్రమే మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఈరోజు ప్రపంచం అంతా కూడా కమ్యూనిస్టు పార్టీ వైపు ప్రజలు కదులుతున్నారు అన్నారు. యావత్ ప్రపంచంలో కొన్ని దేశాలు ఆర్థిక సంక్షోభం ఏర్పడి ప్రజలు తిరగుబడుతుంటే ఆ దేశ అధ్యక్షులు పారిపోయే పరిస్థితి నెలకొన్నది ఈ సంక్షోభ సమయంలో మార్క్సిజం ఎర్రజెండా సిద్ధాంతాలే తప్ప ప్రజలను ఎవరు కాపాడ లేదని అని తెలుసుకొని ప్రజలు చైతన్యవంతులై తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. అమెరికాలోని చీలి, బులీలియా మెక్సికో నికరగావా వెనుజుల దేశాల్లో కూడా వామపక్ష ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. అదే విధంగా కొన్ని రోజుల క్రితం శ్రీలంక దేశంలో కూడా మార్క్ లిస్ట్ నేత అనురకుమారా దిసనాయకే ఆధ్వర్యంలో ఆ దేశ అధ్యక్షునిగా కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు అయింది. ఆదేవిధంగా మన దేశంలో ప్రస్తుతం మోడీ ప్రభుత్వం 150 లక్షల కోట్ల అప్పుచేసి ప్రజలపై పన్నుల రూపంలో పెను భారం వేసి దేశం ఆర్థిక సంక్షోభం వైపు నడిపిస్తున్నారు అని అన్నారు. ఈ ప్రభుత్వం ఈ విధంగానే పాలన కొనసాగిస్తే రానున్న కాలంలో భారత దేశ ప్రజలందరి ఈ దేశానికి మహోత్తర మైన సిద్ధాంతం గల మార్క్సిజం మాత్రమే భారత మానవాళికి మార్గదర్శకం అవుతుంది అన్నారు.ఈ శాఖ మహాసభలో గాంధీ నగర్ సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శిగా బి ప్రసాద్ సహాయ కార్యదర్శిగా ఈదయ్య ను శాఖ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మాలోత్ వినోద్ సీనియర్ నాయకులు పాపా నాయక్, కోటిరెడ్డి, దయానంద్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింగం లక్ష్మికి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు



**నల్లగొండ, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** లైన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ 320 ఈ ఎన్ రిచ్ డిస్ట్రిక్ట్ అవార్డు కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ యందు జరిగిన కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ స్నేహ ప్రెసిడెంట్ లయన్ లక్ష్మి సింగం కి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు 20 23 , 24 డిస్ట్రిక్ట్ గవర్నర్ జి ఏ టి చైర్ పర్సన్ పీఎంజేఎఫ్ లయన్ సిహెచ్ శివప్రసాద్ గారి చేతులమీదుగా తీసుకోవడం జరిగింది.

## ముస్లింల స్థితిగతులపై రౌండ్ టేబుల్ సమావేశం

- అధ్యక్షత వహించిన తాజుద్దీన్
- సూచనలు సలహాలు చేసిన మేధావులు ,వక్తలు




**నల్లగొండ, సెప్టెంబర్ 29 (మనం న్యూస్) :** ఇదారత్ అకామాత కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసుకున్నాం. ముస్లిం మైనారిటీ స్థితి, ఆర్థిక రాజకీయ అంశాల పై సుదీర్ఘంగ వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ముస్లిం యువతను ఉద్యోగం, రజకీయ అవకాశాల కల్పన కోసం వర్క్ షాప్ లను ఏర్పాటు చేసుకువడం, మైనారిటీ విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకోవడం, ఉపాధి అవకాశాల యూనిట్స్ లను నిర్వహించుకోవడం, ముస్లిం ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం సమస్యలపై ప్రజల తో సంతకాల సేకరణ ద్వారా వ్యక్తం చేయడం. వాక్ఫ్ ఆస్తులను, భూములను ముస్లిం యువతకు ఉపాధికోసం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం, వంటి ప్రధాన తీర్మానలను చేసుకోవడం జరిగిందని ముందు ముందు ఈ తీర్మానలపై మరిన్ని సదస్సులను నిర్వహించడం జరుగుతుందని, అధ్యక్షులు సయ్యేద్, తాజోద్దీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షులు, రియాజోద్దీన్, హాఫీజ్ హజ్ కమిటీ అధ్యక్షులు, సయ్యేద్, జాఫర్ విద్యావంతుల కమిటీ అధ్యక్షులు,మసీయొద్దీన్ న్యాయవాది, అన్సారీ డాక్టర్, షఫీ నవాజ్ కాంగ్రెస్ నాయకులు,షేక్, చంద్పాషా మేవా జాతీయ కౌన్సిల్ సభ్యుడు, సయెద్ ఖలీం జఖాత్ కమిటీ మెంబెర్,హాష్మీ ఇంజనీర్,సయ్యద్ పాత్రికేయులు, గాఫూర్ సాబ్ ప్రముఖ పాత్రికేయులు,యం.డి. రఫీ,చంద్పాషా బీ.యస్.పి నాయకులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిజికల్ ఫిట్‌నెస్‌కు కరాటే

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మిరెడ్డి



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 29 (మనం న్యూస్) :** ఫిజికల్ ఫిట్ నెస్... మానసిక వికాసం... క్రమశిక్షణతో కూడిన జీవనం సాగించేందుకు కరాటే, ఇతర మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడతాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మిరెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో సుమన్ షోటే ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 22వ జాతీయస్థాయి కరాటే పోటీలను డీసీసీ ప్రెసిడెంట్ కేతావత్ శంకర్ నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. జాతీయస్థాయి పోటీలకు వచ్చే క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. నిత్య సాధన తో విజేతలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుమన్ షోటే ఖాన్ కరాటే అకాడమీ జాతీయ అధ్యక్షులు బూడిద సైదులు, చీఫ్ ఆర్గనైజర్ రామకృష్ణ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తమ్మడబోయిన అర్జున్, వ్యాపార వేత్త నవీన్, ఎంఈవో బాలనాగయ్య ఉన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

- మాజీ ఎంపిపి దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి



**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం పరిధిలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలక వర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా ప్రభుత్వానికి, విధేయతకు పట్టం కట్టి ప్రోత్సహం అందించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ నూతనంగా బాధ్యతలు స్వీకరించబోయే చైర్మన్ పాలక వర్గానికి కొండమల్లేపల్లి మండలం మాజీ ఎంపిపి దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియచేస్తున్నట్లు ఒక ముఖ్య ప్రకటనలో తెలిపారు.

## దేవరకొండ ఎమ్మెల్యేకు మాదిగలు ఓట్లు వేయలేదా?




**చందంపేట, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** స్థానిక ఎమ్మెల్యే కు మాదిగలు ఓట్లు వేయలేదా దేవరకొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి ఒక్కసారైనా నోచుకోనని మాదిగలు ఎమ్మార్పీఎస్ టీఎస్ దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు పొట్ట మురళి మాదిగ దేవరకొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి ఇప్పటివరకు ఏ ఒక్కసారైనా మాదిగలకు దక్కలేదు కాంగ్రెస్ ప్రభుత్వంకు మాదిగల ఓట్లు వేయడానికి తప్ప పదవులు వీళ్ళకు అక్కర లేదు అన్నట్టు స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ మార్కెట్ డైరెక్టర్ నామినేట్ పదవి మాదిగలకు ఇవ్వకుండా అగ్రకులాలకు ఇవ్వడం ఇది సరికాదని ఎమ్మార్పీఎస్ టీఎస్ దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు పొట్ట మురళి మాదిగ అన్నారు అదేవిధంగా రానున్న రోజుల్లో స్థానిక ఎలక్షన్లలో దేవరకొండ నియోజకవర్గం లో 8 మండలాల్లో కనీసం మూడు ఎంపీపీ లు మరియు జడ్పిటిసిలు ఎస్సీ రిజర్వేషన్లు వచ్చేలాగున రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలియజేయడం జరిగింది. రాష్ట్రంలోని మాదిగలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర సరికాదు అంబేద్కర్ అభయాసం12 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిన ఇప్పటివరకు వాటి ఊసు లేకుండా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి రానున్న ఎలక్షన్లలో నా మాదిగలంతా ఓటు ద్వారా బుద్ధి చెప్తారని తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ చందంపేట మండల అధ్యక్షుడు అందుగుల సైదులు మాదిగ, పీఏ పల్లి మండల అధ్యక్షులు రవణంపల్లి వెంకట్, జిల్లా నాయకులు దర్శనం శివ ,తరి గోవర్ధన్ సీనియర్ నాయకులు నరసింహ నేరేడుగొమ్ము మండల అధ్యక్షులు కుక్కల మల్లయ్య ,కొమ్ము ఉదయ్ ,ఎర్ర విజయ్ ,ఎర్ర సైదులు, తదితరులు పాల్గొన్నారు.

## నవ సమాజ నిర్మాణ బాధ్యత టీచర్లదే

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మిరెడ్డి



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 29 (మనం న్యూస్) :** విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచి... ప్రయోజకులుగా మార్చి నవ సమాజ నిర్మాణమయ్యేందుకు నిరంతరం కృషి చేసే బాధ్యత టీచర్లదేనని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు నల్లమోతు భాస్కరరావు, జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టి బాబు నాయక్ అన్నారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డును అందుకున్న టీజీయుఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ కాంత్ నాయక్ ను ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని లక్ష్మీ కళ్యాణ మండపంలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభకు వారు హాజరై మాట్లాడారు. టీచర్లు సమాజ నిర్దేశకులని... వారిని గౌరవిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. బాణావత్ సైదులు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ కేతావత్ శంకర్ నాయక్, తిరుపతి నాయక్, బాలాజీ నాయక్, బాలునాయక్, రవి నాయక్, లక్ష్మణ్ నాయక్, లావూరి వెంకన్న, వరలక్ష్మి, ధర్మా నాయక్, వెంకట్రామ్ నాయక్, శ్రీను నాయక్, తవుర్య, సీతారాం నాయక్, స్కైలాబ్ నాయక్, శ్రీనివాస్ ఉన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీల ఓటర్ల జాబితా విడుదల

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 29 (మనం ప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొత్తం మీద 3,04,264 పురుష ఓటర్లు, 3, 19,660 మహిళా ఓటర్లు ఇతరులు 23 మంది ఓటర్లు న్నారు. జిల్లాలో 21 మండలాల్లో మొత్తం 479 పంచాయతీలు 4,232 వార్డులు ఉన్నాయి.484 గ్రామపంచాయతీలకు గాను భద్రాచలం డివిజన్లో సీతానగరం, శాంతి నగరం భద్రాచలం బూర్గంపాడు మండలంలో సారపాక, ఐటీసీ 5 పంచాయతీలలో ఎన్నికలు నిర్వహించబడట్లేదు. ఆళ్లపల్లి 12 పంచాయతీలు 90 వార్డులు పురుష ఓటర్లు 4554 మహిళా ఓటర్లు 4541 , అన్నపురెడ్డిపల్లి 10,పంచాయతీలు,98 వార్డులు, పురుష ఓటర్లు 8,246 మహిళా ఓటర్లు 8381 , అశ్వరా వుపేట 30 పంచాయతీలు, 214 వార్డులు పురుష ఓటర్లు 22,654 మహిళా ఓటర్లు ,23,964, అశ్వాపురం 24 పంచాయతీలు, 272 వార్డులు పురుష ఓటర్లు15,945 , మహిళా ఓటర్లు16,963 ,, బూర్గంపాడు 17 పంచాయతీలు, 164 వార్డులు పురుష ఓటర్లు 14, 999 మహిళా ఓటర్లు 15,715, చంద్రుగొండ 14,పంచాయతీలు, 134 వార్డులు పురుష ఓటర్లు 11,517 మహిళా ఓటర్లు11,980, చర్ల 26 పంచాయతీలు, 232 వార్డులు పురుష ఓటర్లు15,342 మహిళా ఓటర్లు 16,572, ,చుంచుపల్లి 18 పంచాయతీలు,168 వార్డులు పురుష ఓటర్లు18,884 మహిళా ఓటర్లు 19,895, దమ్మపేట 31, పంచాయతీలు,290 వార్డులు పురుష ఓటర్లు18,884 మహిళా ఓటర్లు ,19,895 , దుమ్ముగూడెం 37,పంచాయతీలు,324 వార్డులు పురుష ఓటర్లు 17,100 మహిళా ఓటర్లు 18,908,, గుండాల 11,పంచాయతీలు,96, వార్డులు పురుష ఓటర్లు 6,492 మహిళా ఓటర్లు 6,453 , జూలూరుపాడు 24, పంచాయతీలు, 198 వార్డులు పురుష ఓటర్లు13,521 మహిళా ఓటర్లు 14,056,, కరకగూడెం 16పంచాయతీలు,130 వార్డులు పురుష ఓటర్లు 6,331 మహిళా ఓటర్లు 6366, లక్ష్మీదేవి పల్లి 31పంచాయతీలు, 260 వార్డులు, పురుష ఓటర్లు 15,559 మహిళా ఓటర్లు 16,233, మణుగూరు 14పంచాయతీలు,132 వార్డులు, పురుష ఓటర్లు 17,800 మహిళా ఓటర్లు 18,156 ములకలపల్లి 20,పంచాయతీలు,186 వార్డులు పురుష ఓటర్లు 13,573 మహిళా ఓటర్లు 14,059, పాల్వంచ 36, పంచాయతీలు, 282 వార్డులు పురుష ఓటర్లు 13,735 మహిళా ఓటర్లు 14,655, పినపాక 23పంచాయతీలు, 202 వార్డులు పురుష ఓటర్లు 13,049 మహిళా ఓటర్లు 13,836, సుజాతనగర్ 20 పంచాయతీలు, 174 వార్డులు పురుష ఓటర్లు 11,263 మహిళా ఓటర్లు 11,636, టేకులపల్లి 36,పంచాయతీలు, 312 వార్డులుపురుష ఓటర్లు 20,298, మహిళా ఓటర్లు 20,770, ఇల్లందు 29 పంచాయతీలు, 264 వార్డులు పురుష ఓటర్లు 22,356 మహిళా ఓటర్లు 23,732 ఉన్నారు.

## ప్రజాసేవకుడు 'రామలక్ష్మణులు' లేనిలోటు తీర్చలేనిది

- సంస్మరణ సభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 29 (మనం ప్రతినిధి):** ప్రజాసేవకు అంకితమై వారి కష్టాలు, ఇబ్బందులు తీర్చేందుకు నిరంతరం శ్రమించే వ్యక్తి రామలక్ష్మణులని, అలాటి ప్రజానాయకున్ని కొత్తగూడెం పట్టణం కోల్పోవడం బాధాకరమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణ ప్రముఖులు, ప్రజానాయకుడు రామలక్ష్మణులు సంస్మరణ సభ కొత్తగూడెం క్లబ్బులో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి హాజరైన అయన రామలక్ష్మణులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో అయన కూనంనేని మాట్లాడుతూ, ప్రజాహితం కోరుకొని అందు కోసం అనునిత్యం శ్రమించేవారు అరుదుగా ఉంటారని అలాంటి వ్యక్తుల్లో రామణలక్ష్మణులు ఒకరని, కుటుంబ భాధ్యతకంటే సమాజ శ్రేయస్సుకే ప్రాధాన్యత ఇచ్చే వ్యక్తి రామలక్ష్మణులని, అయన లేనిలోటు తీర్చలేనిదని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సలిగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఎన్నిక



**ఖమ్మం, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా శాఖ ఎన్నికలు ఆదివారం డిపిఆర్సి భవనంలో ఏక్రగీవంగా జరిగాయి. అధ్యక్షులుగా మామునూరి రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పి వివిఎస్ఎన్ గుప్తా, రాష్ట్ర కౌన్సిలర్ జి.రవీంద్ర, షేక్ మీరా, మొరం మదు కుమార్ , పి. మధుకర్, సహాయ అధ్యక్షులుగా గొల్లపూడి శ్రీనివాసరావు, జెసీసీ మెంబర్గా బండి భాస్కర్, ఉపాధ్యక్షులుగా సిహెచ్. వాణిశ్రీ, టి. చెంప్పల్ రాజు, ఎంవి కోటేశ్వరరావు, వి. జీవన్ రెడ్డి, కోశాధికారిగా బి శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీగా జి. రవికుమార్, ఎండి ఆసిఫ్, టి. శ్రీనివాస్, భాగ్యలక్ష్మి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా షేక్ జానీ మియా, టి ప్రమీల రాణి, ఎస్ భారతి, బి. వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు మోదుగు వేలాద్రి ఎన్నికల అధికారిగా, రాష్ట్ర అబ్జర్వర్ గా మల్లవరపు రాజేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఏ సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందకుమార్, రాష్ట్ర బాధ్యులు అనంత్, సంఘ పూర్వాధ్యక్షుడు నడింపల్లి వెంకటపతి రాజు, ఎంపీవోల సంఘం జిల్లా అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

# వైభవంగా వురిమళ్ల ఫౌండేషన్ వార్షికోత్సవం

- సమ్మెట ఉమాదేవికి 'భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం'
- స్మారక పురస్కారం ప్రదానోత్సవం
- కథల, కవితల పోటీల విజేతలకు బహుమతులు అందజేత







**ఖమ్మం, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** ప్రముఖ సాహితీ సంస్థ వురిమళ్ల ఫౌండేషన్ 6వ వార్షికోత్సవం ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్లో ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా ఉమ్మడి ఖమ్మంలోని లబ్ధిప్రతిష్టులైన కవులుకు, రచయితలకు అందిస్తున్న 'భోగోజు సముద్రమ్మం-పురుషోత్తం' స్మారక పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ రచయిత సమ్మెట ఉమాదేవికి వార్షికోత్సవ సభలో అందచేశారు. అనంతరం జాతీయ స్థాయిలో నిర్వహించిన వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల, వురిమళ్ల పద్మక స్మారక కవితల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందచేసి సన్మానించారు. తొలుత వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వురిమళ్ల సునంద అధ్యక్షతన జరిగిన సభలో కథల, కవితల సంకలనాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రముఖ రచయిత శ్రీకంఠ స్ఫూర్తి మాట్లాడుతూ ప్రతి ఏటా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులతో పాటు వారి కథలు, కవితలన్నింటిని పుస్తకంగా మలిచి కానుకగా అందజేయడం అభినందనీయమన్నారు. ప్రతి కవి తన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలిస్తే అనేక కథలు, కవితలు పుట్టుకొస్తాయన్నారు. ఈ ఏడాది అద్భుతమైన కథలు వచ్చాయన్నారు. అన్నీ సామాజిక మార్పును కోరుకునేవే ఉన్నాయన్నారు. ప్రముఖ కవి మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ వురిమళ్ల సునంద చేస్తున్న సాహిత్య సేవను కొనియాడారు. సాహితీ కిరణం మాసపత్రిక ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ వురిమళ్ల సునంద తను రాయడమే కాదు అటు పిల్లలతోనూ, ఇటు వర్ధమాన రచయితలతోనూ రాయిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కవిత, కథల పోటీల విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ సాహితీ మాసపత్రిక 'ప్రస్థానం' ఎడిటర్ సత్యాజీ మాట్లాడుతూ వురిమళ్ల సునంద తన తాత వురిమళ్ల శ్రీరాములు, చెల్లెలు వురిమళ్ల పద్మజ పేరుతో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. ఖమ్మం సాహిత్యానికి పెద్ద గుమ్మమని, ఇక్కడి సాహితీ సంస్థలు ఎనలేని సాహితీ సేవ చేస్తున్నాయని, అందులో వురిమళ్ల ఫౌండేషన్ ముందుందని కొనియాడారు. ప్రతి ఏటా ఇచ్చే భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం' స్మారక పురస్కారం ఈ ఏడాది సమ్మెట ఉమాదేవికి ఇవ్వడం సరైన నిర్ణయమన్నారు. ఈ మేరకు విజేతలను, పురస్కార గ్రహీతలను అభినందించారు. వురిమళ్ల ఫౌండేషన్ వెలువరించిన పుస్తకాన్ని అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం సమీక్షించారు. అనంతరం కవులను సన్మానించారు. ఈ సందర్భంగా విజేతలైన కవులంతా తమ స్పందనను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన భోగోజు ఉపేందర్రావు, అక్షరాల తోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్, నంది అవార్డు గ్రహీత దేవేంద్ర, ప్రముఖ కవులు కపిల రాంకుమార్, పొత్తూరి సీతారామరావు, ఇబ్రహీం నిర్గుణ్, రమణ, కోంద్రు బ్రహ్మం, కొమ్మవరపు కృష్ణయ్య, కన్నెగంటి వెంకటయ్య, ఫణిమాధవి, తాళ్లూరి రాధ, మద్దినేని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### కథల, కవితల పోటీల విజేతల్లో సన్మాన గ్రహీతలు వీరే...

వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీల్లో మొదటి బహుమతిని ఎస్వికె సంహితనాయుడు(హైదరాబాద్), ద్వితీయ బహుమతిని కంచర్ల శ్రీనివాస్(ఖమ్మం) అందుకున్నారు. ప్రోత్సాహక బహుమతులను పొత్తూరి సీతారామరాజు(కాకినాడ) అందుకున్నారు. వురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీల్లో మొదటి బహుమతిని నాంపల్లి సుజాత(హైదరాబాద్), ద్వితీయ బహుమతిని చిందం రమేష్(జగిత్యాల), తృతీయ బహుమతిని పొత్తూరి సీతారామారాజు(కాకినాడ) అందుకున్నారు. ప్రోత్సాహక బహుమతిని అవ్వారు శ్రీధర్బాబు(నెల్లూరు)అందుకున్నారు. వీరికి నగదు బహుమతులు అందచేసి సన్మానించారు.

### భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం స్మారక పురస్కారం గ్రహీతలు వీరే

ప్రతి ఏటా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాహితీ వేత్తలకు అందించే 'భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం' స్మారక పురస్కారాన్ని 2019లో ప్రారంభించారు. తొలి ఏడాది అభినవ మొల్ల చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మకు, 2020లో పొత్తూరి వేంకటసుబ్బారావుకు, 2021లో దిలావర్కు, 2022లో బైరి ఇందిరకు, 2023లో తాటికొండాల నర్సింహారావుకు అందచేశారు. ఈ ఏడాది 2024 పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి సమ్మెట ఉమాదేవికి అందచేశారు. పురస్కారంతో పాటు ఆమెకు పది వేల నగదు బహుమతిని అందచేసి సన్మానించారు.

### సమీక్షల సమాహారం పుస్తకావిష్కరణ

జాతీయ స్థాయిలో వురిమళ్ల ఫౌండేషన్ నిర్వహించిన పుస్తక సమీక్షల పోటీల్లో విజేతలైన విద్యార్థుల సమీక్షలతో కలిపి పుస్తకం వెలువరించారు. ఈ పుస్తకాన్ని వురిమళ్ల ఫౌండేషన్ 6వ వార్షికోత్సవంలో పుస్తక సమీక్షలు రాసిన విద్యార్థుల చేతనే ఆవిష్కరించారు. అనంతరం వురిమళ్ల సునంద మాట్లాడుతూ కథలు, కవితలు రాయడం సులభం, ఈ విద్యార్థులు ప్రముఖ కవుల పుస్తకాలను సమీక్ష చేసి పంపి పోటీల్లో విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ సంద్భంగా బాలరచయితలకు సర్టిఫికెట్లు అందచేసి అభినందించారు.

# అధికారులకు పట్టని ప్రభుత్వ ఆసుపత్రి...

- పట్టించుకోని ప్రజాప్రతినిధి
- మందుల కొరత రోగుల ఇబ్బంది
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్



**కొత్తగూడెం, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం మూలంగా డ్రైనేజ్ నుండి వచ్చే మురికినీరు ఆసుపత్రి ప్రాంగణంలో ప్రవహించడం వల్ల విపరీతమైన దుర్వాసన వస్తున్న అధికారులకు పట్టింపే లేదని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,అడ్వకేట్ యెర్రా కామేష్ ఆరోపించారు. పార్టీ శ్రేణులతో కలసి ఆసుపత్రి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు సుమారు 600 మందికి పైగా ఔట్ పేషంట్స్ వచ్చే ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన డాక్టర్లు లేక ఉన్న డాక్టర్లు కూడా సమయానికి రాక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆసుపత్రిలో మందులు లేక,నొప్పులకు వాడే డైక్లోఫీనాక్ లాంటి ఇంజెక్షన్లు కూడా లేక రోగులకు కట్టడానికి బ్యాండేజ్లు కూడా లేకపోవడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వాసుపత్రిలో సమస్యల గురించి ఎన్నిసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా...పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదని ఆరోపించారు.స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న సమస్యలపై కనీసం దృష్టిసారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రోగాలు నయం చేసుకునేందుకు వచ్చే ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రాంగణం...లేని రోగాలను తీసుకొచ్చేలా ఉందని ఆరోపించారు.ప్రజారోగ్యం పట్టని పాలకుల వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు.ఔట్ పేషంట్స్ స్లిప్ లు ఉదయం 9గంటలకు మొదలు పెడితే కొంత మంది వైద్యులు 10 గంటల తర్వాత ఆసుపత్రికి వస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం కోసం తక్షణమే ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇన్ పేషెంట్లు,ఔట్ పేషెంట్లకు సరైన వైద్య చికిత్సలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, జిల్లా అధికారులు డాక్టర్ల కొరత అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డాక్టర్ల నియామకం చేపట్టాలని,మందుల కొరతను నివారించాలని లేని పక్షంలో ప్రజలతో మమేకమై ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ముందే దీక్షకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో బహుజన కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు సాయి, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, వినయ్, అబ్దుల్, హరికృష్ణ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కవి రమేష్కు 'అక్కినేని కవితా 2024' బహుమతి



**ఖమ్మం, సెప్టెంబర్ 29(మనం న్యూస్):** ఖమ్మం కు చెందిన కవి, ప్రభుత్వ ఉపాధ్యాయులు కటుకోర్యుల రమేష్ అక్కినేని కవితా 2024 బహుమతి, నగదు ను శనివారం రాత్రి ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ,యువ కళావాహిని, సాహితీ కిరణం సంయుక్తంగా నిర్వహించిన అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితల పోటీల్లో రమేష్ రాసిన 'స్థిత ప్రజ్ఞుడు' కవిత ప్రథమ బహుమతి అందుకుంది. హైదారాబాద్లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉండి శాసన సభ్యులు కే.రఘురామ కృష్ణం రాజు, అక్కినేని నాటక పరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండల రావు,ప్రముఖ సాహితీ వేత్తలు ఓలేటి పార్వతీశం, పొత్తూరి సుబ్బారావు, ఏస్. వి.రామారావు, జి.వల్లీశ్వర్, తదితరులు కవి రమేష్ను ఘనంగా సన్మానించారు.

## మందుపాతర పేలి ఐదుగురు జవాన్లకు గాయాలు

**చర్ల, సెప్టెంబర్ 29 (మనం న్యూస్) :** చత్తీస్ ఘడ్ రాష్ట్రం బీజపూర్ జిల్లా తర్రం పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు అమర్చిన ఐ ఈ డి పేలి ఐదుగురు జవాన్లకు గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం చిన్న గెల్లేరు సి ఆర్ పి ఎఫ్ క్యాంప్ నుండి భద్రతా దళాల బృందం మందు పాత్రల అన్వేషణ కోసం గాలింపు చర్యలు చేపడుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. గాయపడ్డ భద్రతా దళాలను స్థానికంగా ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం మెరుగైన వైద్యం కొరకు బీజాపూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఇటీవల మావోయిస్టులు అమర్చిన మందుపాతరలు పేలిన ఘటనలో సాదారణ పౌరులతో పాటు భద్రతా దళాలు మృతి చెందడం, గాయపడటం వంటి సంఘటనలు జరిగిన నేపథ్యంలో తాజాగా మరోమారు మందుపాతర పేలి ఐదుగురు జవాన్లు గాయపడం సంచలనంగా మారింది.

# పిడిఎస్యు గోల్డెన్ జూబ్లీ మీటింగ్కు తరలిరండి

- పిడిఎస్యు మాజీ నాయకులు




**ఖమ్మం, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** పిడిఎస్యు 50వ ఆవిర్భావ సందర్భంగా హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గోల్డెన్ జూబ్లీ మీటింగ్కు ఖమ్మం జిల్లాలో ప్రస్తుత, పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిడిఎస్యు పూర్వం విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు స్థానిక రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం శాస్త్రీయ విద్యాసాధన, సమసమాజ స్థాపన, విద్యార్థుల హక్కులు, అన్ని వర్గాల ప్రజల సౌకర్యాల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని, దాని పోరాట ఫలితంగా వేలాదిమంది బుద్ధి జీవులను సమాజానికి అందించిన ఘన చరిత్ర పిడిఎస్యుకు ఉందని అన్నారు. ఇటువంటి పిడిఎస్యు 50 ఏళ్లుగా జార్జి అందించిన స్ఫూర్తితో జంపాల చేసిన నిర్మాణంతో ఎన్ని ఆటంకాలు వచ్చినా ప్రజా ఉద్యమాలలో ముందుండి పోరాడుతున్నదన్నారు. ప్రస్తుత సమాజంలో అనేక మత ఘర్షణలు పాలకులే ప్రోత్సహిస్తున్న స్థితి నెలకొందని, అన్నదమ్ముల్లా కలిసి ఉన్న ప్రజల మధ్య అనేక రకాల ఉద్రిక్తలు నెలకొల్పుతున్న పరిస్థితులు ఉన్నాయని, వీటి పై విద్యార్థులని చైతన్యవంతం చేసే కర్తవ్యం తీసుకుని మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ స్వర్ణోత్సవ మీటింగ్లో జస్టిస్ బిజీ కోల్సే పాటిల్, రిటైర్డ్ హైకోర్టు జడ్జి ప్రొఫెసర్ హరిగోపాల్, కె శ్రీనివాస్, సతీష్ చందర్, పి.రంగారావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. 50 ఏళ్లుగా పిడిఎస్ రంగంలో పనిచేసిన పూర్వం విద్యార్థులందరూ ఖమ్మం జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మనోహర్ రాజు, జి రామయ్య ,ఆవుల అశోక్, ఝాన్సీ డి శ్రీను లక్ష్మి, ఝాన్సీ, సురేష్. వెంకటకృష్ణ, సునీల్, వెంకటేష్, యశోద, పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థలో అసిస్టెంట్ ఫోర్మన్ ట్రైనీ (ఎలక్ట్రికల్) టిఎస్ గ్రేడ్-సి పోస్టల భర్తీ రాత పరీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 29 (మనంప్రతినిధి):** సింగరేణి కాలరీస్ కంపె నీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఫోర్మన్ ట్రైనీ(ఎలెక్ట్రికల్), టి అండ్ ఎస్ గ్రేడ్-సి పోస్టుల ను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసేందుకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ, పీజి కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. '25' ఖాళీలకు గాను అర్హులయిన '170' అ భ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, '161' మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ రాత పరీక్ష సెక్యూరిటీ, విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో, సిసి కెమెరాల నిఘా మధ్య నిర్వహించారు. సింగరేణి మహిళా డిగ్రీ, పీజి కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జిఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్సి పి.సామ్యూల్ సుధాకర్, జిఎం (ఈ అండ్ ఎం) విజిలె న్స్ కే.ప్రసాదరావులు పర్యవేక్షించారు. పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుం దని, దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని, వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి నుంచే సింగరేణి వెబ్ సైట్, సింగరే ణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డుద్వారా తెలియజేయటం జరుగుతుందని తెలియజేశారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో డిజిఎం(పర్సనల్) పి.వేణు గోపాలరావు, విజిలెన్స్ ఆఫీసర్ కే.రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ కే..ప్రకాశ రావు, డివై.పిఎం డి.నాగేశ్వర రావు, కే.సంతోష్ కుమార్, డిప్యూటీ మేనేజర్ (ఐటి) ఎన్. చంద్ర శేఖర్, సీనియర్ పిఓ ఎండి. అబ్దుల్ హాషీమ్ పాషా, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద ఇతర అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

కరీంనగర్
Follow : @Manamnews
మనం
సోమవారం | హైదరాబాద్
30 | 09 | 2024
5

# ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి..

## ప్రతి ఏడుగురు పురుషుల్లో ఒకరికి వచ్చే అవకాశం

- ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయమై.. నాణ్యమైన జీవితం
- 50 ఏళ్ల తర్వాత చిన్న చిన్న పరీక్షలు అవసరం
- దిల్‌సుఖ్‌నగర్ ఏఐఎన్‌యూ సీనియర్ డాక్టర్ శ్రీనివాస్




**రంగారెడ్డి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** ప్రతి ఏడుగురు పురుషుల్లో ఒకరికి వచ్చే అవకాశం ఉన్న ప్రోస్టేట్ క్యాన్సర్ విషయంలో ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) దిల్‌సుఖ్‌నగర్ ఫెసిలిటీ సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్ తెలిపారు. సెప్టెంబరు నెలను ప్రోస్టేట్ క్యాన్సర్ అవగాహన మాసంగా గుర్తించి.. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషిచేస్తున్న నేపథ్యంలో ఆదివారం ఏఐఎన్‌యూ దిల్‌సుఖ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఒక అవగాహన నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఏఐఎన్‌యూ వైద్యులు, సిబ్బందితో పాటు, గతంలో ఇక్కడ ఈ వ్యాధికి చికిత్స చేయించుకున్న పలువురు రోగులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ తర్వాత అత్యంత ఎక్కువగా వచ్చేది ప్రోస్టేట్ క్యాన్సరే. ప్రతి ఏడుగురు పురుషుల్లో ఒకరు దీని బారిన పడుతున్నారు. కానీ, దీనికి ఎలాంటి లక్షణాలూ బయటపడవు. చాపకింద నీరులా వ్యాపిస్తుంది. దాదాపు నాలుగోదశకు వచ్చేవరకు అసలు ఇది ఉందన్న విషయమే చాలావరకు తెలియదు. ఇంత ప్రమాదకరమైన ఈ వ్యాధి గురించి పురుషుల్లో అవగాహన చాలా తక్కువ. అందువల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రోస్టేట్ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ నెలను ప్రోస్టేట్ క్యాన్సర్ అవగాహన మాసంగా గుర్తించారు. సాధారణంగా ప్రోస్టేట్ క్యాన్సర్ అనేది శరీరమంతా విస్తరించేవరకూ దాని లక్షణాలు ఏవీ అంత త్వరగా బయటపడవు. అందువల్ల ముందస్తు పరీక్షలు చేయించుకోవడమే తరుణోపాయం. 50 ఏళ్లు దాటిన పురుషులందరూ ప్రతి సంవత్సరం ఒకసారి ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్ (పీఎస్ఏ), డిజిటల్ రెక్టల్ ఎగ్జామినేషన్ (డీఆర్ఈ) అనే రెండు సాధారణ పరీక్షలు చేయించుకుంటే ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు. ముఖ్యంగా కుటుంబంలో ఎవరికైనా ఇంతకు ముందు ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చినా, లేదా మూత్రవిసర్జనకు సంబంధించిన సమస్యలు ఏవైనా వచ్చినా తప్పనిసరిగా ఒక యూరాలజిస్టును సంప్రదించి, ప్రోస్టేట్ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి అని తెలిపారు. ఈ అవగాహన నడక కార్యక్రమంలో సీనియర్ యూరాలజిస్టు డాక్టర్ సుభాష్‌చంద్ర బోస్, మహిళా యూరాలజిస్టు డాక్టర్ దీప్తి, నెఫ్రాలజిస్టు డాక్టర్ వలీ, ఎనస్థీషియన్లు స్నిగ్ధ, రామకృష్ణ, రఘునాథ్, సల్మాన్, ఏఐఎన్‌యూ దిల్‌సుఖ్‌నగర్ సిబ్బంది, పలువురు పాత పేషెంట్లు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌జీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉత్సాహంగా 5కె రన్

- ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా నిర్వహణ
- పరిసర ప్రాంత కాలనీల వాసులకు సీపీఆర్‌లో శిక్షణ



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** మనమంతా గుండెను జాగ్రత్తగా కాపాడుకోవాలని, ప్రతిరోజూ కనీసం 45 నిమిషాలు నడవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతోనే ఇది సాధ్యమని నగరంలోని ప్రధాన ఆస్పత్రులలో ఒకటైన ఎస్ఎల్‌జీ ఆస్పత్రి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దండు శివరామరాజు అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె రన్‌ను ఆయన ప్రారంభించారు. చుట్టుపక్కల కాలనీలకు చెందిన దాదాపు 400 మందికి పైగా ఇందులో పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు ఆస్పత్రి వద్ద ప్రారంభమైన ఈ పరుగు, చివరకు మళ్లీ 7.45 గంటలకు ఆస్పత్రి వద్దే ముగిసింది. కొద్దిసేపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం పరుగులో పాల్గొన్న అందరికీ అల్పాహారాలు అందించారు. ప్రధానంగా నిజాంపేట, కూకట్ పల్లి, కౌసల్య కాలనీ, బండారి లేఅవుట్, బాచుపల్లి తదితర ప్రాంతాల్లోని వివిధ అపార్టుమెంట్లు, రెసిడెన్షియల్ సొసైటీలకు చెందినవారు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్థానికులలో ఉత్సాహం ఉన్నవారందరికీ బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్), కార్డియోపల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్)లలో శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు మాట్లాడుతూ, నిజాంపేట, కూకట్ పల్లి పరిసర ప్రాంతాల వారి సౌకర్యార్థం ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా కొన్ని ప్యాకేజీలను ప్రకటించారు. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 15 వరకు ఇవి అమలులో ఉంటాయని తెలిపారు. సాధారణంగా రూ.2,999 విలువ చేసే ఈసీజీ, 2డీ ఎకో, కార్డియాలజిస్టు కన్సల్టేషన్ పరీక్షలతో కూడిన ప్యాకేజీని రూ. 799కే అందిస్తున్నామన్నారు. అలాగే రూ. 13,999 విలువ చేసే యాంజియోగ్రామ్ పరీక్షను రూ.4,999కే చేస్తామని తెలిపారు. సాధారణంగా నడుస్తున్నా, మెట్లు ఎక్కుతున్నా ఆయాసం వచ్చేవాళ్లు; ఏమీ కారణం లేకుండానే చెమట పట్టినవాళ్లు, గుండె బాగా వేగంగా లేదా తక్కువగా కొట్టుకుంటున్నా, గుండెల్లో మంటగా అనిపించినా, దవడ, మెడ లేదా భుజాల్లో నొప్పి వచ్చినా, కాళ్ల వాపు కనిపించినా వెంటనే గుండె వైద్య నిపుణులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాశాఖలో నియామకాలు వెంటనే చేపట్టాలి

- ఫోరం చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి




**నల్లగొండ, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** యూనివర్శిటీ నుంచి మొదలు ప్రైమరీ వరకు వెంటనే బోధనా, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టాలని తెలంగాణ లెక్చరర్ ఫోరం చైర్మన్ డాక్టర్ కత్తి వెంకట స్వామి అన్నారు. టిఎల్ఎఫ్ చేపట్టిన మిషన్ ఎడ్యుకేషన్ తెలంగాణ ఉద్యమంలో భాగంగా నిర్వహిస్తున్న సమాలోచన సదస్సును చుక్కా సైదులు అధ్యక్షతన ప్రభుత్వ లెక్చరర్స్ భవన్లో నిర్వహించారు.ఈసందర్భంగా రాష్ట్రంలో విద్యావ్యవస్థలోని సమస్యలు వాటి పరిష్కారాలు- నాణ్యమైన విద్యకోసం తీసుకరావాల్సిన సంస్కరణలపై సదస్సు నిర్వహించి నల్లగొండ ప్రాంత విద్యావేత్తలు ఉపాధ్యాయ, ఆధ్యాపక, యాజమాన్యాల నుండి అభిప్రాయాలు,సలహాలను స్వీకరించారు.అందరి అభిప్రాయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్లు 20 నుండి 25 శాతం వరకు నిధులు కేటాయిచాలని, సమాన విద్యావకాశాలు,తక్షణమే ప్రస్తుతం ఉన్న విద్యాలయాలను బలోపేతం చేయాలన్నారు.ప్రైమరీ విద్య, మాధ్యమిక విద్య, ఉన్నత విద్యను వేరువేరుగానే సమన్వయంతో నిర్వహణ, నియంత్రణలై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు.గోనారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పరిస్థితి- విద్యావ్యవస్థకు కావాల్సిన అవసరాలు ఆర్థిక వెన్నుదన్ను మధ్య తేడా ఉందని అది పూరించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో యంజయు నుండి ప్రొసెసర్ అంజిరెడ్డి,టీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ,మహిళా అధ్యక్షురాలు రణిని,ప్రధానకార్యదర్శి బి. వేణు, కారస్వర్శి గోపి, జనార్ధనరెడ్డి కందాళపాపిరెడ్డి శ్రీనివాస్రెడ్డి, ఆంజి, ఉపేందర్, శివరాంరెడ్డి, సజ్జత్, కృష్ణ, శివప్రసాద్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనం ఓ మధురానుభూతి



**సూర్యాపేట, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** స్నేహం అనేది ఓమధురమైనది. మరుపురానిదని నాగార్జున ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మారగోని వెంకట్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్లో జరిగిన నూతనకల్ నాగార్జున ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనతో పాటు పలువురు పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ మనుషులు వీడి దశాబ్దాలు గడిచినా మనుషులు కలవాలని ఏర్పాటు చేసుకునే సమ్మేళమే అత్మీయమని అభిప్రాయ పడ్డారు. ఎన్నోన్నో జ్ఞాపకాలు, సరదాలు, సంతోషాలు, చిలిపి పనులు, కలహాలు, కలయిక ఈఅత్మీయ సమ్మేళనంలో బాగమని అన్నారు. నేడు మనం ఎక్కడ ఉన్నా పూర్వాన్ని మర్చిపోలేమని బాల్యం అనేది ఓ మధురానుభూతిని మిగుల్చుతుందని గుర్తు చేశారు. అయినప్పటికి నేడు మనమంతా ఈవ్యవస్థలో నిలద్రొక్కుకున్నమంటే నాడు ఏర్పడ్డ విద్యాసంస్థయే ముఖ్యమన్నారు. ఈసందర్భంగా ముమ్మందు ఎవరికి ఏటువంటి పరిస్థితుల్లోనైనా సమస్య తలెత్తితే ఇంతే దృఢ సంకల్పంతో పరిష్కారం చూపేందుకు కలిసి కట్టుగా ముందుకు సాగాలని పూర్వ విద్యార్థులంతా ప్రతిజ్ఞ చేశారు. ఈఆత్మీయ సమ్మేళనానికి పూర్వ ఉపాధ్యాయులు బొక్క వీరారెడ్డి, ఎం. దీన్‌దయాల్‌రెడ్డి, సోమిరెడ్డి, మంజుల, లింగయ్య, వెంకట్‌రెడ్డి, శ్యామ్, శరత్‌లు హాజరు కాగా విద్యార్థులు ఉపేందర్‌రెడ్డి, దేవేందర్, రాజశేఖర్, చంద్రయ్య, లక్ష్మణ్, ఉమ, కవిత తదితరులు పాల్గొన్నారు.

## పురుషోత్తం మృతి పట్ల సంతాపం

**తిరుమలగిరి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** రాష్ట్ర మంతి నలమాద ఉత్తంకుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తంరెడ్డి(89) మృతి పట్ల తాటిపాముల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. పరుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర యాదగిరి, బోయపల్లి కిషన్, చెరుకు సోమయ్య, పులమామిడి యాదగిరి, బోనాసి పరుశరాములు, ఆగయ్య, పయ్యల రమేష్, బేతు ప్రవీణ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**తాటిపాములలో పుట్టిన పురుషోత్తంరెడ్డి.**

రాష్ట్ర భారీ, నీటిపారుదలశాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తంకుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో జన్మించి 1983లో హైదరాబాద్‌లో వెళ్లి పీహెచ్ఎల్‌లో ఉద్యోగం చేశారు. పురుషోత్తంరెడ్డి –ఉష దంపతులకు ఉత్తంకుమార్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి ఇద్దరు కుమారులు ఒక కూతురు ఉన్నారు. ఉత్తంకుమార్‌రెడ్డి ప్రస్తుత మంత్రిగా కొనసాగుతున్నారు. ఇప్పటికి తాటిపాముల ప్రజలతో అనుబంధం వీరి కుటుంబానికి ఉన్నది. పరుషోత్తంరెడ్డి మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలనుముకున్నాయి. ఆయన కుటుంబంతో అనుబంధం ఉన్న అనాటి పెద్ద మనుషులు మృతి పట్ల విచారణ వ్యక్తం చేశారు.

### తిరుమల శ్రీవారి సేవకు తరలివెళ్లిన భక్తులు



**వీణవంక, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** మండలంలోని బొంతుపల్లి గ్రామంలోని 25మంది, పరిసర గ్రామాలకు చెందిన శ్రీవారి భక్తులు తిరుమల శ్రీవారి సేవకులుగా వెళ్లి స్వామి వారికి సేవలందిస్తున్నామని టీం లీడర్ బావు సంపత్ అన్నారు. శ్రీవారి సేవకు వెళ్లేవారు ఆన్‌లైన్ లో పేర్లు నమోదు చేసుకోవాల్సివుంటుందని, తమ గ్రామం నుండి 24మంది స్వామివారి సేవకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.హిందూ ధర్మ ప్రచారం కొరకు గోవిందనామస్మరణ చేస్తూ స్వామివారి సేవల్లో తరించడం గొప్ప అనుభూతిని ఇస్తుందని మరో టీం సభ్యుడు వడ్లూరి అశోక్ అన్నారు. కరీంనగర్ నుండి తిరుపతికి వారానికి 4రోజులు రైళ్లు నడిచేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకొని భక్తులకు రైళ్లను అందుబాటులో కి తీసుకు రావాలని చదువు మహేందర్‌రెడ్డి, చదువు జితేందర్‌రెడ్డి లు కోరారు. సేవకు వెళ్లిన వారిలో రత్నాకర్‌రెడ్డి, వీరగోని శ్రీనివాస్, నల్లగోని రమేష్, బాలరాజు, రామకృష్ణరెడ్డి, రవి, వెంకన్న తదితరులు ఉన్నారు.

### జర్నలిస్టులకు అండగా యాదాద్రి భువనగిరి ప్రెస్ (క్లబ్) సొసైటీ



**భువనగిరి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్) :** ఆపదలో ఉన్న జర్నలిస్టులకు భువనగిరి ప్రెస్ (క్లబ్) సొసైటీ అండగా ఉంటుందని సొసైటీ ప్రధాన కార్యదర్శి గంధమల్ల రాజు, కోశాధికారి ఆరే కుమార్ అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన విలేకరులు దండు కృష్ణ, సుర్పంగ కుమార్‌లకు సొసైటీ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఆపదలో సొసైటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రెస్ క్లబ్ అహర్నిశలు పని చేస్తుందన్నారు. జర్నలిస్టులకు ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి ప్రెస్ (క్లబ్) సొసైటీ కార్యవర్గ సభ్యులు కూరేళ్ల మల్లేశం, సొసైటీ సభ్యులు లక్ష్మీ నారాయణ, భువనగిరి కిషన్, గోపి మహేష్ , మొహమ్మద్ శానుర్ బాబా, నిమ్మల సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాల పరామర్శ



**మహా ముత్తారం, సెప్టెంబర్ 29 (మనం న్యూస్) :** మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగమల్ల దుర్గయ్య తల్లి లింగమల్ల సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెంద డంతో ఆదివారం శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శీను బాబు ఆ కుటుంబాన్ని ప్రగాఢ సానుభూతి వెలుబుచ్చారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ఆయన వెంట మహా ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొ న్నారు.

### పల్లె రుచులు రెస్టారెంట్ ప్రారంభం

- నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**చండూరు, సెప్టెంబర్ 29 (మనం న్యూస్) :** దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పల్లె రుచులు రెస్టారెంట్ ను నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసందైన రుచుల కోసం పల్లె రుచులు రెస్టారెంట్ సందర్శించాలని కోరారు.నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు.ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్,సంకు కొండల్ రెడ్డి, రెస్టారెంట్ నిర్వాహకులు మాజీ సర్పంచ్ పాత్లవత్ పద్మదస్రు నాయక్, చింతపల్లి పుల్లయ్య, నాగవరం మహేష్, కశిరెడ్డి రవీందర్ రెడ్డి, జైహింద్ రెడ్డి,రేపని ఇదయ్య, వజిద్, బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ తులిసిరాం, వాడత్య బాలు,బొడ్డుపల్లి శేఖర్, జనార్ధన్ రావు, బొడ్డుపల్లి అంతయ్య, మహేందర్, సాజిద్, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

### కొనసాగుతున్న క్షేత్రస్థాయి ఆర్గానిక్ వ్యవసాయ సదస్సు




**నల్లగొండ, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా చత్రపతి శివాజీ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నల్గొండ శివారు లాలయ్యగూడెంలో రైతులతో ఆర్గానిక్ వ్యవసాయంపై శ్రీసత్యం వర్మి బయో ఆర్గానిక్స్ సేల్స్ డైరెక్టర్స్ అక్కినపల్లి కిరణ్, బాను ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్గానిక్ వ్యవసాయంలో రైతులు అనుసరించదగ్గ వివిధ పద్ధతులు, రసాయనాల బదులు కషాయాలు వాడడం, వానపాములు రైతు నేస్తాలు, వర్మి కంపోస్టు వాడడం వల్ల భూమి బలోపేతం అయ్యే విధానం మరియు కెమికల్ క్రిమిసంహారకాలకు బదులు ప్రభుత్వం గుర్తించిన సర్టిఫైడ్ బయో ఉత్పత్తుల గురించి రైతులకు క్షుణ్ణంగా వివరించడం జరిగింది.

### నాణ్యమైన వస్త్రాలు అందించి ప్రజల మన్ననలు పొందాలి

- హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చన రవి

**హుజూర్ నగర్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్) :** నాణ్యమైన వస్త్రాలు అందించి ప్రజల మన్ననలు పొందాలని హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చనరవి అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిబాబా మందిరం ఏరియాలో నూతనంగా ఏర్పాటుచేసిన రెయిన్ బో వస్త్రాలయంను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పండగ శుభాకాంక్షలతో కొనుగోలుదారులకు నమ్మకమైన నాణ్యమైన వస్త్రాలు విక్రయించి, కొనుగోలుదారుల మన్ననలు పొందాలన్నారు. చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో నారపరాజు శ్రీనివాసరావు,మున్సిపల్ కౌన్సిలర్ వీర్లపాటి గాయత్రీ భాస్కర్, ఎండి నిజాముద్దీన్, భూక్య మంజు నాయక్, రెయిన్ బో షాప్ యాజమాన్యం అలీమ్,రఫీఖా దంపతులు, దీప, నీలామంజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక



**చండూరు, సెప్టెంబర్ 29 (మనం న్యూస్) :** ఖమ్మం జిల్లా కొత్త గూడెంలో వచ్చే నేల 1.2. తేదీల్లో జరగబోయే అండర్ 17 విభాగం ఉమ్మడి జిల్లా స్థాయీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్బాల్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎన్నికైన హోలియా పట్టణానికి చెందిన విద్యార్థి చింతలచెరువు తేజు ఎంపికయ్యారు. ప్రస్తుతం తేజు చండూరు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కె.అర్జున్ మరియు కోచ్ లింగ్యా నాయక్ తెలిపారు.పాఠశాల సిబ్బంది తేజూ ను ఆనందించారు.

## పురుషోత్తంరెడ్డికి సంతాపం తెలియజేసిన యోగానందచార్యులు



**జాజిరెడ్డిగూడెం, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** పౌరసరఫరాలు మరియు నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి నల్లమాద పరుషోత్తంరెడ్డి మరణం పట్ల సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దరూరి యోగానందచార్యులు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకురాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి , కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతిరెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. అనంతరం జూబ్లీహిల్స్ మహాప్రస్థానం అంత్రక్రియలలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో గోల్కొండ గోల్ఫ్ కోర్సు

- హైదరాబాద్లో వచ్చే ఏడాది ఇంటర్నేషనల్ గోల్ఫ్ టోర్నమెంట్
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్):** గోల్కొండలోని గోల్ఫ్ కోర్సును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆదివారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన 'తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ చాంపియన్ షిప్' ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జూపల్లి.. విజేతగా నిలిచిన శంకర్ దాస్‌కు ట్రోఫీ, రూ.లక్ష నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ చాంపియన్ షిప్‌ను ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్ టోర్నమెంట్గా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ను ఆసియా ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ సర్క్యూట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతి గోల్ఫ్ సీఈవో మనవి జైనీ, హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ అధ్యక్షుడు బీవీకే రాజు, డీఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ చైర్మన్ అజయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్యలతో బస్సులు కొనిపిస్తాం



**కరీంనగర్, సెప్టెంబరు 29 (మనం న్యూస్):** రాష్ట్రంలోని మహిళా సమాఖ్యలచే బస్సులను కొనుగోలు చేయించి అద్దె ప్రాతిపదికన ఆర్టీసీకి నడిపించనున్నామని, ఆ మేరకు మెప్మాతో సంప్రదింపులు జరుపుతున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం కరీంనగర్, జనగామ జిల్లా లింగాలఘణపురంలో జరిగిన కార్యక్రమాల్లోనూ, సిద్దిపేటలో మీడియాతోనూ ఆయన మాట్లాడారు. కరీంనగర్–జేబీఎస్ మార్గంలో తిరిగే 35 ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులను కరీంనగర్లో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, మేడిపల్లి సత్యం, సంజయ్‌కుమార్లతో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరీంనగర్లో త్వరలోనే ఇదే తరహాలో మరో 39 బస్సులను సంస్థ వాడకంలోకి తెస్తుందన్నారు. అలాగే, నిజామాబాద్‌కు 67, వరంగల్‌కు 86, సూర్యాపేటకు 52, నల్లగొండకు 65, హైదరాబాద్కు 74 ఈ తరహా బస్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. కాలుష్యరహిత సమాజం కోసం హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల ఎలక్ట్రిక్ బస్సులు నడపాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దశలవారీగా 2400 బస్సులను కొనుగోలు చేసేందుకు సంస్థ కసరత్తు చేస్తున్నదని తెలిపారు. అలాగే, మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తున్నదని చెప్పారు. కొత్త బస్సులకు సరిపడా ఉద్యోగ ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని, ఇప్పటికే 3035 పోస్టుల నియామక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. 2013 బకాయిలకు సంబంధించిన బాండ్ల డబ్బును కండక్టర్లు, డ్రైవర్లకు సంస్థ చెల్లించిందని, దసరాలోపు మిగతా ఉద్యోగుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను మాత్రమే తొలగిస్తున్నామని, నివాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఇబ్బంది పెట్టడం లేదని, ఎక్కడా బలవంతంగా ఇళ్లను కూల్చడం లేదని స్పష్టం చేశారు. కానీ, ప్రతిపక్షాలు కావాలనే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. వీలైనంత త్వరలో రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని, ఇందులో పార్టీ సీనియర్లకు న్యాయం చేస్తామని అన్నారు. రాష్ట్రంలో కోర్టు తీర్పుకనుగుణంగా రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టేందుకు వేగవంతంగా కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి పొన్నం చెప్పారు. కులగణన తర్వాత జనాభా ధామాషా ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. గీత కార్మికులకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా లాంటి బకాయిలను దసరాలోపు చెల్లించేందుకు ఆర్థిక శాఖను ఆదేశిస్తామని చెప్పారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కోహెడ, సెప్టెంబర్ 29, (మనం న్యూస్):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ 1998–1999 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఒక్క చోట కలుసుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమరులైన విద్యార్థిని, విద్యార్థులు, గురువులను తలచుకుని నివాళులర్పించారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను గౌరవంగా సత్కరించి సన్మానించారు. విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రామ్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, బాలయ్య, చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, అబ్దుల్ వహాబ్, పూర్వ విద్యార్థులు ఉల్లెంగుల మహేందర్, యాటల శంకర్, పొన్నాల రవీంధర్, నాగరాజు, రాజేందర్, భాస్కర్, ప్రమోద్, శ్రీకాంత్, ఎమ్.పద్మ, రమాదేవి, ఆకుల రజిత, రాధిక, శ్రీలత, రేణుక, తదితరులున్నారు.



# పేదల ఇళ్ల జోలికి వెళ్లడం తొందరపాటే

- హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ది దుష్ప్రచారం: దానం నాగేందర్




**హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్):** పేదల ఇళ్ల జోలికి వెళ్లడం తొందరపాటు నిర్ణయమే అవుతుందని, బాధితుల్లో భరోసా కల్పించేందుకు నిజనిర్ధారణ కమిటీ వేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరనున్నట్టు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చెప్పారు. బంజారాహిల్స్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెరువులు, కుంటలను కాపాడేందుకు హైడ్రాను ఏర్పాటు చేశారని, కానీ అధికారులు పేదలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. జలవిహార్, పార్క్ హోటల్.. శిఖం భూమిలో ఉన్నాయని వాటిని ఎందుకు కూల్చరని ప్రశ్నించారు. వీటి పక్కనే బఫర్ జోన్లో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్ పది అంతస్తులు.. శోభా బిల్డర్స్‌కు 15 అంతస్తుల నిర్మాణాలు ఉన్నాయని.. అప్పట్లో కేటీఆర్ వీటికి ఎలా అనుమతులు ఇచారని నిలదీశారు. హైడ్రా పేరిట బీఆర్ఎస్, బీజేపీ ప్రజలను భయపెడుతున్నాయని, అందరి ఇళ్లు కూల్చేస్తారంటూ దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. గత సీఎం కేసీఆర్ కూడా భవిష్యత్తులో మూసీ నది పొంగితే తీవ్ర అనర్థం వాటిల్లే ప్రమాదం ఉందని ఓ సర్వే ద్వారా గుర్తించారని చెప్పారు. అప్పట్లో 12వేల మంది నిర్వాసితులను వేరే చోటుకు తరలించాలని భావించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదన్నారు. గతంలో బఫర్ జోన్లో అక్రమ కట్టాడాలను కూల్చివేయాలని చెప్పిన హరీశ్ ఇప్పుడు మాట మార్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రేటర్ హైదరాబాద్లోని 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికే తమపై ఉన్న కేసును చూపించి బీఆర్ఎస్ అధిష్ఠానం వారిని ఆపుతోందని, ఆలస్యమైనా వారు కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని చెప్పారు.

# గాంధీ ఆసుపత్రికి బోయి విజయభారతి పార్థివదేహం

- అనారోగ్యంతో శనివారం కన్నుమూత
- జ్యోతిరావుపూలే జీవిత చరిత్రను తెలుగులోకి అనువదించిన తొలి రచయిత్రి

**హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్):** ప్రఖ్యాత రచయిత్రి, సాహితీ విమర్శకురాలు డాక్టర్ బోయి విజయభారతి పార్థివ దేహాన్ని కుటుంబసభ్యులు గాంధీ వైద్య కళాశాలకు ఆదివారం మధ్యాహ్నం అప్పగించారు. జ్యోతిరావుపూలే జీవిత చరి త్రను తెలుగులోకి అనువదించిన తొలి రచయిత్రి, పురాణ, ఇతిహాసాలపై విశ్లేషణాత్మక వ్యాఖ్యానాలు రాసిన ప్రసిద్ధ విమర్శకురాలు బోయి విజయభారతి (84) శనివారం కన్నుమూసారు. కొంతకాలంగా జీర్ణకోశ సమస్యతో బాధపడుతున్న ఆమె హైదరాబా ద్లోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆమె, ప్రముఖ కవి బోయి భీమన్న, నాగరత్నమ్మ దంపతుల కుమార్తె. ప్రఖ్యాత మానవహ క్కుల న్యాయవాది దివంగత బొజ్జా తారకం సతీమణి. విజయభారతి కుమార్తె డాక్టర్ మహిత ఉస్మానియా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్. కుమారుడు రాహుల్ బొజ్జా తెలంగాణ ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ. విజయభారతి పుట్టి, పెరిగింది తూర్పుగో దావరి జిల్లా రాజోలులో హైదరాబాద్లోని కోఠి మహిళా కళాశాలలో డిగ్రీ, ఉస్మాని యా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చదివారు. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రోత్సాహంతో ఓయూలో పీహెచ్డీలో చేరిన ఆమె... ఆచార్య పల్లా దుర్గయ్య పర్య వేక్షణలో 'దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం – సాంఘిక పరిస్థితులు' అంశంపై పరిశోధన పూర్తి చేశారు. 1965 నుంచి 78 వరకు నిజామాబాద్ మహిళా కళాశాల అధ్యాపకురా లిగా, వైస్ ప్రిన్సిపల్‌గా పని చేశారు. తెలుగు అకాడమీలో రీసెర్చ్ ఆఫీసరుగా, డిప్యూటీ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇన్‌చార్జి డైరెక్టర్‌గా 1999లో పదవీ విరమణ పొందారు. ఆమె హయాంలోనే రాష్ట్ర స్థాయి ఇంటర్ పాఠ్యపుస్తకాలు ఇంగ్లిషు మాధ్యమంలో రాయించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. భారతీయ కులవ్యవస్థ ఆధారం గా పురాణ, ఇతిహాసాలపై విశ్లేషణాత్మక వ్యాఖ్యానాలు రాశారు. 'సత్యహరిశ్చంద్రుడు ', 'వ్యవస్థను కాపాడిన రాముడు', 'షట్చక్రవర్తులు', 'రామాయణ మునులు', 'దశావ తారాలు', 'నరమేధాలు– నియోగాలు', 'ఇతిహాసాలు మహాభారతం', 'పురాణాలు– మరోచూపు', 'ఇతిహాసాలు– రామకథ' తదితర రచనలు వెలువడ్డాయి. ఆమె రాసిన కొన్ని వ్యాసాలు '75ఏళ్ల స్వాతంత్ర్య భారతం స్త్రీలకు గుప్పెడు ధూళినే మిగిల్చిందా?' పేరుతో సంపుటిగా ప్రచురితమైంది. విజయభారతి రాసిన 'బాబాసాహెబ్ డాక్టర్ అం బేద్కర్', 'మహాత్మా జ్యోతిరావు పూలే' జీవిత చరిత్రలు అమితాదరణ పొందాయి. నా గార్జున విశ్వవిద్యాలయం 2020లో విశిష్ట మహిళా పురస్కారంతో సత్కరించింది. విజయ భారతి కోరిక మేరకు ఆమె భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కళాశాలకు అందించారు.



# కులగణన వెంటనే చేపట్టాలి..

- దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలి
- మార్గదర్శకాలపై ఇంకా జాప్యమెందుకు?
- సదస్సులో బీసీ నేతలు, మేధావులు
- రెడ్లు, ఓసీల ఓట్లు నాకు అవసరం లేదు
- 2028లో బీసీనే సీఎం: తీన్మార్ మల్లన్న

**హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్):** రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న బీసీలకు న్యాయం జరగాలంటే.. తక్షణమే కులగణన చేపట్టాలని, దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ నేతలు, మేధావులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కులగణన చేపడతామంటూనే జాప్యం చేస్తోందని, దీంతో వారి చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తోందని అన్నారు. బీసీ కమిషన్కు మార్గదర్శకాలు ఇవ్వడంలో ఆలస్యం ఎందుకని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్లోని ఓ హోటల్లో తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగుల సమాఖ్య, పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ (పీసీసీసీ) సంయుక్తంగా 'కులగణన' అంశంపై మేధావులు, బీసీ నేతలతో సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. బీసీ గణనతో రానున్న రోజుల్లో ఆ కులాల్లో మరింత ఐక్యత వస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు కష్టపడి పనిచేస్తే.. పదవులు మాత్రం అగ్రవర్ణాల వారు అనుభవిస్తున్నారని తెలిపారు. వారిని అధికారం నుంచి దించడం అంత తేలిక కాదని, అట్టడుగు స్థాయి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఏకమైతేనే అది సాధ్యమవుతుందని చెప్పారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ.. యూపీఏ హయాంలో సామాజిక కులగణన కోసం ప్రయత్నం జరిగిందని, దీనికోసం రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టారని తెలిపారు. దాని ప్రకారం 52 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందన్నారు. అయితే ఇందులో అనేక తప్పులున్నాయంటూ నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ఎన్డీయే ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చే సిందని చెప్పారు. కానీ, కమిటీకి నిధులు, విధులు ఇవ్వకపోవడంతో ఆ లెక్కలు అలాగే మరుగున పడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కులగణన చేసే ఉద్దేశం కనిపించడం లేదని, ఈ పరిస్థితిలో మార్పు వచ్చేందుకు బీసీ సంఘాలు, మేధావులు ఏకతాటిపై నిలిచి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.



రాజకీయాలను శాసించనున్న బీసీలు..

తెలంగాణకు రేవంత్‌రెడ్డే చివరి ఓసీ సీఎం అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. 2028లో బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారన్నారు. తెలంగాణ రాజకీయాలను బీసీలు శాసించబోతున్నారని చెప్పారు. తనకు రెడ్లు, ఓసీల ఓట్లు వద్దని, బీసీల ఓట్లు చాలునని అన్నారు. ఓసీ నేతలు ఈ మాట చెప్పగలరా? అని సవాల్ విసిరారు. బీసీ ఉద్యోగులపై కొందరు ఆధిపత్య కులాలకు చెందిన అధికారులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఏసీబీకి పట్టిస్తున్నారని మండి పడ్డారు. రాష్ట్రంలో కులగణన చేయడంతోపాటు రిజర్వేషన్లలో బీసీలకు 42శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణులు, వైశ్యుల్లోని పేదలు కూడా బీసీలతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. దేవళ్ళ సమ్మయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్ కన్వీనర్ అనిల్ జైహింద్, ప్రొఫెసర్లు పీఎల్ విశ్వేశ్వరరావు, సింహాద్రి, తిరుమలి, మురళీమనోహర్, తదితరులు కులగణన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- భారతీయ కిసాన్ సంఘ్ నాయకుడు కవ్వ వేణుగోపాల్ రెడ్డి

**హుస్నాబాద్,సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** జాతీయ రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకుడు కవ్వ వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేసారు. జాతీయ రహదారి పనుల్లో నాణ్యత లేదని వెంటనే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర విజిలెన్స్ అధికారులతో వెంటనే విచారణ జరిపించి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్‌కు సహకరిస్తున్న అధికారుల పై కొరడా విధించాలన్నారు. నేషనల్ హైవే రోడ్డు పనులను పూర్తి స్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా చేపట్టాలన్నారు.

## ఉత్తమ రీజియన్ అవార్డు అందుకున్న గట్టుపల్లి అశోక్ రెడ్డి




**నల్లగొండ, సెప్టెంబర్ 29 (మనం న్యూస్):** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 2023–24 సంవత్సరం సంబంధించి ఫస్ట్ రీజియన్ ఛాంపియన్షిప్ల 320 ఈ ఖమ్మం నల్గొండ జిల్లాలకు సంబంధించి అవార్డులనందు ఉత్తమ రీజియన్ చైర్ పర్సన్ అవార్డును గట్టు పల్లి అశోక్ రెడ్డి.ఉత్తమ జోన్ చైర్ పర్సన్‌గా యర్రమాద శ్రీనివాస్ అవార్డులను జిల్లా గవర్నర్ యారాల ప్రభాకర్ రెడ్డి కె.వి ప్రసాద్ జిల్లా గవర్నర్‌లో చేతులు మీదుగా ఈ రోజు ఖమ్మం జిల్లా పాల్వంచ నందు నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు.

## రైతులకు న్యాయం చేయాలి

- బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్



**అక్కన్నపేట, సెప్టెంబర్ 29, (మనం న్యూస్):** మండలంలోని కపూర్ తండాకు చెందిన రైతులకు న్యాయం చేయాలని బిఎస్పి పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో తాతల కాలం నుండి ఉన్న వ్యవసాయ భూములను ధరణి పోర్టల్ ద్వారా ఒకటి నుంచి 288 సర్వే నెంబర్ వరకు 932 ఎకరాలు వ్యవసాయ భూములను బ్లాక్‌లిస్టులో పెట్టడం జరిగిందన్నారు. సీలింగ్ భూములుగా నమోదు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. వారి ఆర్థిక కష్టాలు తీర్చడానికి భూమిని అమ్ముకోకుండా అవుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. గత బీఆర్ఎస్ చేసిన తప్పిదాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రత్యేక చొరవ చూపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. ఆ భూముల పై వెంటనే ప్రభుత్వాధికారులచే విచారణ చేపట్టి ఆ భూములను బ్లాక్ లిస్టు నుండి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, నాయకులు జేరిపోతుల రవీందర్, రైతులు అజ్మీర్‌రాజు, బానోతు సంతోష్, తదితరులున్నారు.

## మోదీని గద్దె దించే వరకు చావను: ఖర్గే

**శ్రీనగర్, సెప్టెంబర్ 29 :** జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీలు జోరు పెంచాయి. అయితే.. కతువా జిల్లాలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అనూహ్య ఘటన జరిగింది. వేదికపై ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అస్వస్థతకు గురయ్యారు. ప్రసంగిస్తున్న సమయంలో అదుపు తప్పి పడబోయారు. అప్రమత్తమైన భద్రత సిబ్బంది, నేతలు ఆయన పడిపోకుండా అడ్డుకున్నారు. వెంటనే నీరు తాగించారు. అస్వస్థకు గురైనా ఖర్గే తన ప్రసంగాన్ని మాత్రం ఆపలేదు. పార్టీ నేతలు ఆయనను పట్టుకుని నిలబడి ఉండగా.. ప్రసంగాన్ని కొనసాగించారు. 'జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తిరిగి తీసుకువస్తాం. అందుకోసం పోరాడుతూనే ఉంటాం. ఎనిమిది పదుల వయసులో ఉన్న నేను.. అప్పుడే చనిపోను. మోదీ సర్కార్‌ను గద్దె దించే వరకు అలసిపోను. అప్పటివరకు బతికే ఉంటా'' అని పేర్కొన్నారు. ఖర్గే అస్వస్థకు గురైన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన కాంగ్రెస్ అధిష్టానం కశ్మీర్ నేతలను అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రసంగం అనంతరం అధినేతను ఆసుపత్రికి తరలించారు. నిపుణులైన వైద్య బృందం ఆధ్వర్యంలో ప్రస్తుతం ఖర్గే చికిత్స పొందుతున్నారు. ఖర్గే ఆరోగ్య పరిస్థితిపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ, సీనియర్ నేత ప్రియాంక గాంధీ, ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆరా తీసినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. జమ్మూకశ్మీర్లోని ఏడు జిల్లాల పరిధిలో తొలిదశలో 24 నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. తొలి దశలో మొత్తంగా 61 శాతం పోలింగ్ నమోదు అయింది. రెండోవిడత పోలింగ్ ఆరు జిల్లాల్లోని 26 నియోజకవర్గాల్లో పూర్తైంది. మూడో విడత పోలింగ్‌కు కశ్మీర్ ప్రజలు సంసిద్ధమవుతున్నారు.

## మనం మిత్రులను మార్చగలం కానీ పొరుగువారిని మార్చలేం

**శ్రీనగర్, సెప్టెంబర్ 29 :** పాకిస్థాన్‌పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యూఢిల్లీతో పాక్ సత్సంబంధాలు కొనసాగించి ఉంటే బెయిల్‌అవుట్ ప్యాకేజీ కింద అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి ఇస్లామాబాద్ కోరినదాని కంటే పెద్ద ఆర్థిక ప్యాకేజీని ఇండియా ఇచ్చి ఉండేదన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బండిపోర జిల్లాలోని గురేజ్ అసెంబ్లీ సెగ్మెంట్లో ఆదివారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'మనం మిత్రులను మార్చగలం కానీ పొరుగువారిని మార్చలేం'' అని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా రాజ్‌నాథ్ ప్రస్తావిస్తూ, పాక్ సరైన సంబంధాలు కొనసాగించి ఉంటే ఐఎంఎఫ్ కంటే మనమే ఎక్కువ మొత్తంలో ప్యాకేజీ ఇచ్చి ఉండేవాళ్లమని అన్నారు. జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం కేంద్రం నిధులు ఉస్తుంటే, పాకిస్థాన్ మాత్రం చాలాకాలంగా ఆర్థిక సాయాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. సొంతగడ్డపై ఉగ్రవాద ఫ్యాక్టరీని నడిపేందుకు ఇతర దేశాల నుంచి పాకిస్థాన్ డబ్బులు కోరుతోందన్నారు. 'టెర్రరిజంపై ఎప్పుడు విచారణ జరిపినా అందులో పాక్ ప్రమేయం కనబడుతూనే ఉంది. ఉగ్ర శిబిరాలను ఆపేయాలని అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పాక్కు చెప్పిచూసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. 370వ అధికరణ రద్దుతో ఆశాభంగం కలిగిన పాక్ ఉగ్రవాదాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలు సాగిస్తోంది. ఇక్కడ ప్రజాస్వామ్యం వెళ్లానుకోవడం ఆ దేశానికి ఇష్టం లేదు. కానీ సొంతగడ్డపైనే పాక్కు గుణపాఠం చెప్పగలిగే సత్తా ఇండియాకు ఉంది. పాకిస్థాన్లోని ఎవరైనా ఇండియాపై దాడికి తలబడితే సరిహద్దులు దాటి మరీ స్పందిస్తా' అని రాజ్‌నాథ్ తెలిపారు. అటల్ బిహారీ వాజ్‌పేయి చెప్పినట్టు 'మానవత్వం, ప్రజాస్వామ్యం, కశ్మీర్ ప్రజల గుర్తింపు' ను సాధించగలిగితే కశ్మీర్ తిరిగి భూతల స్వర్గం అవుతుందని అన్నారు.



## శివరాజ్ సింగ్‌కు బీజేపీ పగ్గాలు?

### ఆరెస్సెస్, పార్టీ వర్గాల మద్దతు
### సుదీర్ఘ రాజకీయ, పాలన అనుభవం
### సవాళ్లను ఎదుర్కోవడంలో దిట్టగా పేరు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా స్థానంలో పార్టీ పగ్గాలు ఎవరికి అప్పగిస్తారనేది ఆసక్తికరంగా మారింది. పార్టీ అధ్యక్ష పదవికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్(65) పేరును ఆర్ఎస్ఎస్‌తో పాటు బీజేపీలోని పలు వర్గాలు సమర్థించినట్లు తెలుస్తోంది. ప్రశాంతంగా ఉండే తత్వం, రాజకీయ చతురతకు తోడు అసాధారణ మీడియా మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు ఉన్న ఆయన బలమైన పోటీదారుగా నిలిచారు. మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న శివరాజ్ సింగ్.. క్లిష్టమైన సవాళ్లను సైతం ఎదుర్కోగలనని నిరూపించుకున్నారని, అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్న ఇతర నాయకుల్లో ఎవరికీ ఈ లక్షణాలు లేవని ఆరెస్సెస్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి ఇప్పటివరకూ చర్చించిన నేతల్లో చౌహాన్ అత్యుత్తమ ఎంపికని, ఆయనకున్న ప్రజాదరణకు తోడు విస్తృతమైన అనుభవంతో పార్టీకి మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపాయి. బీజేపీతో పాటు సంఘ్తో ఆయనకున్న దశాబ్దాల నాటి అనుబంధం కూడా పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాయి. ఆరెస్సెస్‌లో అజాతశత్రువుగా పేరొందిన శివరాజ్‌కున్న పోరాడే తత్వం, శ్రేణుల్లో ఏకాభిప్రాయాన్ని సాధించే నేర్పు జాతీయ స్థాయిలో బీజేపీని నడిపించే నాయకుడికి ఉండాల్సిన కీలక నైపుణ్యాలని ఆరెస్సెస్ ప్రముఖుడు ఒకరు అభిప్రాయపడ్డారు.

# జనానికి సంకలనాత్మక కథనాలే ఇష్టం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 :** ప్రధాని మోదీ మన్‌కీ బాత్ 114వ ఎపిసోడ్‌లో ప్రసంగించారు. పదేళ్ల క్రితం అక్టోబర్ 3న మన్‌కీ బాత్ ప్రారంభమైందని మోదీ గుర్తు చేశారు. మన్ కీ బాత్‌లో స్ఫూర్తిదాయక కథనాలు, సానుకూల అంశాలు ప్రజలను ఆకర్షించాయని వివరించారు. ప్రజలు సకారాత్మక పరిణామాలు, స్ఫూర్తిదాయక, ప్రోత్సాహక కథనాలను ఇష్టపడుతున్నట్లు తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' సూచించిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం స్పష్టం చేశారు. రేడియో కార్యక్రమం తాజా ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ ప్రసారం పది సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నదని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజల కృషి, సామాజిక అంశాల గురించి మోదీ 'మన్ కీ బాత్'లో ప్రస్తావిస్తుంటారు. దీనిని 'భావోద్వేగపూరిత' ఎపిసోడ్‌గా మోదీ అభివర్ణిస్తూ, ఈ కార్యక్రమం భారత స్ఫూర్తికి ప్రతీకగా నిలిచే, దేశ సంఘటిత బలాన్ని ప్రదర్శించే విశిష్ట వేదికగా మారిందని పేర్కొన్నారు, దీని సందేశాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నందుకు ఆయన మీడియాకు కూడా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధానాంశం ఉత్కంఠ కలిగించేదిగా లేకుంటే లేదా ప్రతికూలంగా ఉంటే ప్రజలు దృష్టి పెట్టరన్న అపోహ ఉందని, అయితే, 'మన్ కీ బాత్' వారు సకారాత్మక సమాచారం కోసం ఆత్రుతతో ఉంటారని సూచించిందని మోదీ తెలిపారు.

జనానికి సకారాత్మక విషయాలు, ప్రేరణ కలిగించే ఉదాహరణలు, ప్రోత్సాహక కథనాలను ఇష్టపడతారని ఆయన చెప్పారు. 'భారత్‌లో తయారీ' కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నదని ప్రధాని మోదీ తెలిపారు. ప్రతి రంగంలో ఎగుమతులు పెరుగుతున్నాయని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)లో పెరుగుదల దాని విజయానికి తార్కాణమని ఆయన నొక్కిచెప్పారు. అది స్థానిక ఉత్పత్తిదారులకు ఎంతో ఉపయుక్తం అయిందని ఆయన తెలిపారు. మోదీ ఇటీవలి తన యుఎస్ పర్యటనను ప్రస్తావిస్తూ, సుమారు 300 పురాతన వస్తువులు భారత్కు తిరిగి రావడం గురించి విస్తృతంగా చర్చించుకుంటున్నారని చెప్పారు.

తమ వారసత్వ సంపద గురించి ప్రజలు గర్వంగా భావించసాగుతున్నప్పుడు ప్రపంచం కూడా వారి మనోభావాలను గౌరవిస్తుంటుందని మోదీ తెలిపారు. తన ప్రభుత్వం అధికారంలో ఉన్న గడచిన పది సంవత్సరాల్లో వివిధ దేశాల నుంచి అధిక సంఖ్యలో పురాతన కళాఖండాలు భారత్‌కు తిరిగి చేరుకున్నాయని ఆయన తెలియజేశారు, మోదీ ఈ కార్యక్రమంలో 'స్వచ్ఛ భారత్' పథకం విజయం గురించి ప్రధానంగా ప్రస్తావించారు. తన జీవితం పొడుగునా పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాముఖ్యం ఇచ్చిన మహాత్మా గాంధీకి ఆ పథకం గొప్ప నివాళి అని ఆయన శ్లాఘించారు.

అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ పథకం పది సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నది. దానిని ప్రజా ఉద్యమంగా మలచినవారిని కొనియాడవలసిన సందర్భం అది. దాని కోసం తన జీవితాన్ని అంతా అంకితం చేసిన మహాత్మా గాంధీకి అది సరైన నివాళి కూడా' అని మోదీ పేర్కొన్నారు. గాంధీజీ జయంతి అక్టోబర్ 2న జరగనున్నది. తగ్గించు, తిరిగి వాడు, పునరుపయోగించు' సూత్రం గురించి ఇప్పుడు మాట్లాడుకుంటున్నారని ఆయన చెప్పారు. వర్ష రుతువులో దేశంలో పుష్కలంగా వర్షాలు కురియడంతో, నీటి సంరక్షణకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో చేస్తున్న కృషిని మోదీ ప్రస్తావించి ఆ ప్రక్రియను శ్లాఘించారు.

కొన్ని వారాలుగా దేశ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. నీటి సంరక్షణ ఎంత ముఖ్యమో వర్షకాలం సూచిస్తుందని, నీటి నిర్వహణ చాలా కీలకమని, నీటి సంరక్షణకు అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు.

20 వేల భాషలకు భారత్ పుట్టినిల్లు అని, దేశంలోని భాషల పరిరక్షణకు చర్యలు తీసుకుందామని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 'తల్లి పేరిట మొక్క' కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని, ఉత్తర ప్రదేశ్లో తల్లి పేరిట మొక్క కింద 26 కోట్ల మొక్కలు నాటామని, గుజరాత్లో 15 కోట్లకు పైగా మొక్కలు నాటామని మోదీ తెలియజేశారు. మొక్కలు నాటి వాతావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని మోదీ పిలుపునిచ్చారు. నూతన ఉత్పత్తుల తయారీదారులు క్రియేట్ ఇన్ ఇండియాలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పండుగల సందర్భంగా మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తులను భారతీయులు కొనుగోలు చేయాలన్నారు. ప్రతి రంగంలో ఎగుమతులు పెరిగాయని, విదేశీ సంస్థాగత మదుపరులను ఆకర్షించడంలో ప్రభుత్వం ఎంతో పురోగతి సాధించిందని ప్రశంసించారు.

తెలంగాణకు చెందిన కేఎన్ రాజశేఖర్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆయన నాలుగేళ్లుగాప్రతి రోజు ఒక మొక్క నాటారని, రాజశేఖర్‌కు ఉన్న నిబద్ధత తనతోసహా అందరినీ ఆశ్చర్య పరుస్తుందని మోదీ తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని రాజశేఖర్ ఒక ఉద్యమంలాగా, కఠినమైన వ్రతంలా నిర్వహించారని కొనియాడారు. ఈ ఏడాది ప్రమాదానికి గురైన తర్వాత కూడా ఆయన తన దృఢ సంకల్పాన్ని వదలకపోవడం అత్యంత గొప్ప విషయని ప్రశంసించారు. రాజశేఖర్‌కు హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు.

తెలంగాణ, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు లక్ష్యానికి మించి మొక్కలు నాటి సరికొత్త రికార్డు సష్టించాయని మోదీ తెలిపారు. బుధవారం నాటికి దేశవ్యాప్తంగా 80 కోట్ల మొక్కలు నాటడం ద్వారా లక్ష్యాన్ని సాధించామని కేంద్ర పర్యావరణ శాఖ తెలిపిందని గుర్తు చేశారు.




## మహాయుతి సర్కార్ విజన్

### పుణె మెట్రో సెక్షన్‌ను ప్రారంభించిన మోదీ

**పుణె, సెప్టెంబర్ 28 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం న్యూ పుణె మెట్రో సెక్షన్ను ప్రారంభించారు. జిల్లా కోర్టు, స్వర్గేట్ మధ్య నడిచే ఈ భూగర్భ మార్గంతో పుణెలోని అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్ గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. దీనితో పాటు రూ.11,200 కోట్ల విలువ చేసే ప్రాజెక్టుల శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేశారు. వర్చువల్ తరహాలో వీటిని ప్రధాని ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని హాజరుకావాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత దృష్ట్యా ఆయన పర్యటన రద్దయింది. ప్రధాని వర్చువల్ తరహాలో ప్రారంభోత్సవాల సందర్భంగా మహారాష్ట్రలోని అధికార మహాయుతి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. పుణెలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సామర్థ్యం కూడా పెంచుకుంటూపోవాలని, పుణె పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ఆధునీకరించినప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. ఇందుకోసం తాము అనేక చర్యలు చేపట్టామన్నారు. సిటీ పెరుగుతున్నప్పుడు ఏరియాల మధ్య అనుసంధానం కూడా గణనీయంగా పెరగాలన్నారు. ఇదే విజన్‌తో మహాయుతి ప్రభుత్వం రేయింబవళ్లు శ్రమిస్తోందని చెప్పారు. మహారాష్ట్రలో ఇంతకముందు అధికారంలో ఉన్న మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం కనీసం ఒక మెట్రో పిల్లర్ను కూడా నిర్మించలేకపోయిందన్నారు. కానీ తమ ప్రభుత్వం పుణెలో మెట్రో నెట్‌వర్క్‌ను నిర్మించిందన్నారు. సోలార్ ఎయిర్‌పోర్ట్ అప్‌గ్రేడేషన్‌పై మాట్లాడుతూ, ఆదివారం విఠల్ భగవానుని ఆశీస్సులతో నేరుగా షోలాపూర్‌కు ఎయిర్ కనెక్టివిటీ కల్పించేందుకు ఎయిర్‌పోర్ట్ అప్‌గ్రేడేషన్‌పై పూర్తయిందని చెప్పారు.

# నెరవేర్చలేని వాగ్దానాన్ని బీజేపీ చేయదు

**చండీగఢ్, సెప్టెంబర్ 29 :** అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న హర్యానాలో కాంగ్రెస్‌పై కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం తన విమర్శలు కొనసాగించారు. వృద్ధ పార్టీ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్, కర్నాటక వంటి రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ ఎన్నికల గ్యారంటీల అమలు పూజ్యం అని అమిత్ షా ఆరోపించారు. గురుగ్రామ్ జిల్లా బాద్షాపూర్లో ఒక ఎన్నికల ర్యాలీలో అమిత్ షా ప్రసంగిస్తూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ బడా వాగ్దానాలు చేస్తుంటుందని, కానీ వారు హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, తెలంగాణలలో తమ ఎన్నికల వాగ్దానాలను అమలు చేయలేకపోయారని విమర్శించారు. 'రాహుల్ గాంధీ గ్యారంటీలు నిరర్థకం అయ్యాయి' అని ఆయన ఆరోపించారు. మరొక వైపు బీజేపీ తాను నెరవేర్చలేని ఎటువంటి వాగ్దానాన్నీ చేయదని కేంద్ర హోమ్ శాఖ మంత్రి చెప్పారు. 'రాహుల్ బాబా బృందం అభివృద్ధిని చేపట్టజాలదు' అని, హర్యానా అభివృద్ధిని సాధ్యం చేసేది డబుల్ ఇంజన్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. 'మేము దేశ సరిహద్దును కాపాడతాం, రిజర్వేషన్లను పరిరక్షిస్తాం, 370 అధికరణం పునరుద్ధరణను ఎన్నటికీ అనుమతించబోం' అని ఆయన ఉద్ఘాటించారు. వక్ఫ్ బిల్లు గురించి ర్యాలీలో అమిత్ షా ప్రస్తావిస్తూ, 'వక్ఫ్ బోర్డుపై ప్రస్తుత చట్టంతో ఒక సమస్య ఉంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో దానిని సవరిస్తాం' అని చెప్పారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ వక్ఫ్ సవరణ బిల్లు లక్షం సమాజంలో చీలిక సృష్టించడమేనని పలువురు ప్రతిపక్ష నేతలు క్రితం నెల ఆరోపించారు. తాము దానిని గట్టిగా వ్యతిరేకిస్తామని వారు స్పష్టం చేశారు. బాద్షాపూర్ నుంచి రావ్ నర్బీర్ సింగ్‌తో సహా గురుగ్రామ్ ప్రాంతంలో పార్టీ అభ్యర్థుల తరఫున అమిత్ షా ప్రచారం సాగిస్తూ, సైన్యంలో ప్రతి పదవ జవాను హర్యానా నుంచి వచ్చినవారేనని తెలిపారు.

ఇందిరా గాంధీ నుంచి మన్మోహన్ సింగ్ వరకు కాంగ్రెస్ 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' డిమాండ్ను నెరవేర్చలేదని అమిత్ షా ఆరోపిస్తూ, వన్ ర్యాంక్ వన్ పెన్షన్ను 2015లో ఇచ్చింది నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని తెలిపారు. అగ్నిపథ్ పథకంపై రాహుల్ గాంధీని అమిత్ షా విమర్శిస్తూ, రాహుల్ గాంధీ ఒక 'అసత్య యంత్రం' అని పేర్కొన్నారు. అగ్నివీర్లకు ఉద్యోగాలు లభించబోవని లోక్సభలోని ప్రతిపక్ష నాయకుడు అన్నారని కేంద్ర మంత్రి ఆరోపించారు. సాయుధ బలగాల్లో యువజనుల సంఖ్య గణనీయంగా పెంచేందుకే అగ్నివీర్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు అమిత్ షా తెలియజేశారు. ఆ అంశంపై బీజేపీని కాంగ్రెస్ అదేపనిగా దుయ్యబట్టుతుండడంతో, 'మీ పిల్లలను సైన్యంలోకి పంపేందుకు వెనుకాడకండి. ప్రతి ఒక్క అగ్నివీర్‌కు హర్యానా, కేంద్రం పింఛన్ లభించే ఉద్యోగాలు ఇస్తాయి' అని అమిత్ షా సభికులతో చెప్పారు. 'ఐదు సంవత్సరాల తరువాత పింఛన్ లభించే ఉద్యోగం లేని ఒక్క అగ్నివీర్ను కూడా మీరు చూడబోరు' అని అమిత్ షా అన్నారు.

# పేదోళ్లను అడ్డుపెట్టి బిల్డర్ల వ్యాపారం

**వాషింగ్టన్/హైదరాబాద్, సెప్టెంబరు 29 (మనం న్యూస్):** 'హైదరాబాద్‌లో చెరువులు, నదీ గర్భాల్లో కూడా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిని ఇప్పటికైనా ఆపకపోతే భవిష్యత్తు తరాలకు పెద్ద ప్రమాదం వాటిల్లుతుంది. ఇది హైదరాబాద్‌కు ప్రాణాంతకంగా మారుతుంది. పేదోళ్లను అడ్డం పెట్టి బిల్డర్లు వ్యాపారం చేస్తున్నారు' అని డిప్యూటీ సీఎం భట్టివిక్ర మార్క ఆరోపించారు. అమెరికా పర్యటనలో ఉన్న భట్టివిక్రమార్క.. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సుల్ జనరల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో మాట్లాడారు. 'హైదరాబాద్ అంటేనే గుట్టలు, చెరువులు, పార్కులు! ఇళ్ల నిర్మాణం పేరిట గుట్టలు కనుమరుగైపోయాయి. చెరువులను కబ్జా చేసి ఇళ్లు కట్టారు. పార్కులనూ లేకుండా చేస్తున్నారు. చెరువులే లేకుంటే.. ఇటీవల వరదలకు విజయవాడ నగరం చిక్కుకుపోయిన పరిస్థితే హైదరాబాద్‌కు ఏర్పడుతుంది' అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ధన, మాన, ప్రాణ, ఆస్తులను కాపాడడం ప్రభుత్వం బాధ్యతని, అందులో భాగంగానే చెరువులను రక్షించి భవిష్యత్తు తరాలకు అదించే కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు. మూసీ నదిలో మంచి నీరు పారించడం, నగరంలో పార్కులు తయారు చేయడం వంటివి చేయాలన్నది తమ ఆలోచనన్నారు. మూసీ నది పునరుజ్జీవంలో భాగంగా నిర్వాసితులకు పూర్తి అవగాహన కల్పించి.. పునరావాస చర్యలు చేపడుతున్నామన్నారు. నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, వారి పిల్లలు చదువుకునేందుకు అవకాశం కల్పించడం, వారి ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలు చేపట్టడం.. వారంతా మంచి వాతావరణంలో బతికేలా చూడడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. కలుషితమైన మూసీ నది పక్కన జీవించడం ఎవరికి కూడా మంచిది కాదన్నారు. కాగా.. తెలంగాణలోని వనరులను గుర్తించి పద్ధతి ప్రకారం వినియోగిస్తామని, విద్య, వైద్యం, సేవా రంగాలను తీర్చిదిద్దుతామని, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గతంలో ఫ్యూడల్ మనస్తత్వంతో బందీ చేయబడిన రాష్ట్రాన్ని పూర్తి స్వేచ్ఛాయుత రాష్ట్రంగా మార్చామని, భవిష్యత్తులో ఈ విధానం కొనసాగుతుందన్నారు. ఎవరు ఏ భావజాలాన్నయినా వ్యక్తపరిచే వాతావరణాన్ని ఏర్పరిచామని వివరించారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు వారి మేధస్సు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడాలని, పెట్టుబడులు పెట్టి అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ప్రవాసీలను కోరారు. గతంలో ఫ్యూడల్ మనస్తత్వంతో బందీ చేయబడిన రాష్ట్రాన్ని పూర్తి స్వేచ్ఛాయుత రాష్ట్రంగా మార్చామని, భవిష్యత్తులో ఈ విధానం కొనసాగుతుందన్నారు. ఎవరు ఏ భావజాలాన్నయినా వ్యక్తపరిచే వాతావరణాన్ని ఏర్పరిచామని వివరించారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు వారి మేధస్సు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడాలని, పెట్టుబడులు పెట్టి అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ప్రవాసీలను కోరారు.

## జమిలిపై ముందుకే!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** లోక్‌సభలో బీజేపీకి సొంతంగా మెజారిటీ లేకపోయినా.. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై మోదీ ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గడంలేదు. జమిలి ఎన్నికలను సాకారం చేసేందుకు పార్లమెంటులో మూడు బిల్లులను ప్రవేశపెట్టాలని సంకల్పించింది. వీటిలో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసులను కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన సంగ తి తెలిసిందే. ప్రతిపాదిత మొదటి రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. 'అపాయింటెడ్ డే (ప్రభుత్వం ప్రారంభమయ్యే రోజు)'కు సంబంధించి 82ఏ అధికరణలో కొత్తగా సబ్‌క్లాజ్ (1) చేరుస్తారు. లోక్‌సభ, అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీల పదవీకాలాన్ని ఒకేసారి ముగించేందుకు 82ఏలోనే సబ్‌క్లాజ్ (2) జోడిస్తారు. ఇక లోక్‌సభ పదవీకాలం, రద్దుకు సంబంధించి 83(2) అధికరణను సవరించి కొత్తగా సబ్‌క్లాజ్ (3), (4)లను చేరుస్తారు. రాష్ట్రాల అసెంబ్లీల రద్దు నిబంధనలూ ఇందులో ఉంటాయి. 327అధికరణను సవరించి 'సమాంతర ఎన్నికలు' అనే పదబంధాన్ని జోడిస్తారు. ఈ బిల్లుకు కనీసం సగం రాష్ట్రాలు ఆమోదించాల్సిన అవసరం లేదని కోవింద్ కమిటీ సిఫారసు చేసింది. దీనిని క్యాబినెట్ ఆమోదించింది. ఇక రెండో రాజ్యాంగ సవరణకు మాత్రం కనీసం సగం రాష్ట్రాల అంగీకారం తప్పనిసరి. ఎందుకంటే ఇది స్థానిక ఎన్నికలకు సంబంధించింది. పూర్తిగా రాష్ట్ర జాబితాలోని అంశం. లోక్‌సభ/అసెంబ్లీ ఎన్నికలతో పాటు సమాంతరంగా పంచాయతీరాజ్/పురపాలక, నగరపాలక సంస్థలకూ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల(ఎస్ఈసీ)తో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సంప్రదింపులు జరి పి అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా రూపొందించడానికి ఉద్దేశించిన బిల్లు ఇది. దీనిప్రకారం 324ఏ అధికరణను కొత్తగా చేరుస్తారు. రాజ్యాంగం ప్రకారం ఈసీ, ఎస్ఈసీ వేర్వేరు వ్యవస్థలు. ఈసీ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, అసెంబ్లీ, శాసన మండలి ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎస్ఈసీ పంచాయతీలు, మునిసిపాలిటీల ఎన్నికల నిర్వహణ బాధ్య త చూస్తున్న సంగతి తెలిసిందే. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియమ నిబంధనలు కేంద్ర పాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూకశ్మీరు అసెంబ్లీలకు కూడా వర్తించేలా మూడు చట్టాలు.. ఢిల్లీ దేశరాజధాని ప్రాంత ప్రభుత్వ చట్టం (1991), కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం (1963), జమ్మూకశ్మీరు పునర్వ్యవస్థీకరణ (2019) చట్టాలను సవరించాలని మూడో బిల్లులో ప్రతిపాదించనున్నారు. వీటికి సంబంధించిన అధికరణల్లో 12 కొత్త సబ్‌క్లాజులను చేరుస్తారు. రెండు దశల్లో జమిలి ఎన్నికలను నిర్వహించాలని కోవింద్ కమిటీ సూచించింది. మొదటి దశలో లోక్‌సభ, అన్ని రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని పేర్కొంది. ఇవి జరిగిన వంద రోజుల్లోపు రెండో దశలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని సిఫారసు చేసింది.

## వారసుడొచ్చాడు

### డిప్యూటీ సీఎంగా ఉదయనిధి, మంత్రులుగా మరో నలుగురు




**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన కుమారుడు, ప్రస్తుత మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఉపముఖ్యమంత్రిగా ప్రమోట్ అయ్యారు. మరో నలుగురిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. వీరితో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చెన్నైలోని రాజ్‌భవన్‌లో ఆదివారంనాడు ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కూడా హాజరయ్యారు. కొత్తగా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఇటీవల మనీలాండరింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిలుపై విడుదలైన వి.సెంథిల్ బాలాజీతో పాటు ఆర్.రాజేంద్రన్ (సేలం-నార్త్) గోవి చెళియన్ (తిరవిడైమరుదూరు), ఎస్.ఎం నాజర్ (అవడి) ఉన్నారు. కాగా, సెంథిల్‌కు విద్యుత్, ఎక్సైజ్ శాఖలను కేటాయించగా, గోవి చెళియన్‌కు సాంకేతిక విద్య, ఎలక్ట్రానిక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీతో సహా హైయర్ ఎడ్యుకేషన్ శాఖను కేటాయించారు. నాజర్‌కు మైనారిటీ వ్యవహారాలు, ఆర్.రాజేంద్రన్‌కు పర్యాటక శాఖను ప్రభుత్వం కేటాయించినట్టు రాజ్‌భవన్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయనిధి స్టాలిన్ ఇప్పటికే యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి శాఖను నిర్వహిస్తున్నారు. ప్లానింగ్ అండ్ డవలప్‌మెంట్ శాఖ పర్యవేక్షణ బాధ్యతలు కూడా తీసుకున్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో ఉప ముఖ్యమంత్రిగా ప్రమోట్ అయ్యారు.

మనం

Follow : @Manamnews



## రెండో టెస్ట్.. మూడో రోజు ఆట రద్దు..!



ఇండియా వర్సెస్ బంగ్లాదేశ్ రెండో టెస్టుకు వర్షం ఆటంకం కలిగిస్తూనే ఉంది. మూడో రోజు ఆట కూడా ఒక్క బంతి పడకుండానే తుడిచిపెట్టుకుపోయింది. వర్షం లేకున్నా.. మైదానంలోని ఓవైపు ఔట్ ఫీల్ మొత్తం చిత్తడిగా మారడంతో పలు మార్లు పరిశీలించిన అంపైర్లు చివరకు మూడో రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో ఔట్ ఫీల్డ్లో ఓవైపు పూర్తిగా నీరు నిలిచిపోయింది. గ్రౌండ్ స్టాఫ్ వాటిని తొలగించే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకపోయింది. దాంతో ఇరు జట్ల ఆటగాళ్లు నిరాశగా మైదానాన్ని వీడారు. ఈ మ్యాచ్లో తొలి రోజు ఆటలో 55 ఓవర్లు మింగేసిన వరణుడు.. రెండో రోజు ఆటలో ఒక్క బంతి కూడా పడనివ్వలేదు. మూడో రోజు ఆట కూడా రద్దవ్వడంతో ఈ మ్యాచ్ డ్రా అయ్యే అవకాశాలు ఉన్నాయి. చివరి రెండు రోజుల ఆట సాధ్యమైనా.. అద్భుతం జరిగితే తప్పా ఫలితం తేలడం కష్టం. ఈ మ్యాచ్‌లో టాస్ గెలి చిన టీమిండియా బౌలింగ్ ఎంచుకోవడంతో బంగ్లాదేశ్ ముందు గా బ్యాటింగ్ చేసింది. తొలి రోజు వర్షంతో మ్యాచ్ నిలిచిపోయే సమయానికి బంగ్లాదేశ్ 35 ఓవర్లలో 3 వికెట్లకు 107 పరుగులు చేసింది. క్రీజులో మోమినల్ హక్(40 నాటౌట్), ముష్ఫికర్ రహీమ్(6 బ్యాటింగ్) ఉన్నారు. నజ్మూల్ హోస్సేన్ షాంటో(31), షెడ్మన్ ఇస్లామ్(24), జకీర్ హసన్(0) విఫలమయ్యారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు వికెట్లు తీయగా.. రవిచంద్రన్ అశ్విన్ ఓ వికెట్ పడగొట్టాడు. మ్యాచ్ ప్రారంభమైన తొలి మూడు రోజులు వర్షం కురుస్తుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. భారత్ తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా విన్నింగ్ కాంబినేషన్ను కొనసాగించింది. చివరి రెండు రోజులు ఆట సాధ్యమయ్యే అవకాశాలు ఉండటం.. కాన్పూర్ అభిమానులకు పెద్ద ఊరట. ఈ మ్యాచ్ డ్రాగా ముగిస్తే టీమిండియాకు నష్టం జరగనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ 2025 పాయింట్స్ టేబుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న టీమిండియాకు ఆ స్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలంటే ఈ మ్యాచ్ గెలవడం చాలా కీలకం. ఒక వేళ మ్యాచ్ డ్రా అయితే .. తదుపరి 8 టెస్టుల్లో 6 మ్యాచ్లు తప్పక గెలవాల్సి ఉంటుంది. టీమిండియా సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు టెస్టులు.. ఆస్ట్రేలియా గడ్డపై 5 మ్యాచ్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆడనుంది.

# న్యూజిలాండ్‌పై ఇన్నింగ్స్ విజయం..



సొంతగడ్డపై తొలి టెస్టులో న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించిన శ్రీలంక .. రెండో టెస్టులోనూ తడాఖా చూపించింది. వరల్ టెస్టు చాంపియన్షిప్ విజేత అయిన కివీస్‌పై భారీ తేడాతో విజయ గర్జన చేసింది. అరంగేట్ర ఆఫ్ స్పిన్నర్ నిషాన్ పెరిస్(6/170), పేసర్ ప్రభాత్ జయసూర్య(3/139)లు విజృంభించడంతో కివీస్‌పై భారీ విజయం సాధించింది. తొలి టెస్టులో 63 రన్స్‌తో గెలుపొందని లంక.. ఇప్పుడు ఏకంగా ఇన్నింగ్స్ 154 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. వరుసగా రెండు విజయాలు సాధించిన ధనంజయ డిసిల్వా బృందం 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. అంతేకాదు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో మూడో స్థానాన్ని సంపాదించింది.

గాలే స్టేడియంలో శ్రీలంక బౌలర్లు ఓ రేంజ్లో చెలరేగారు. తొలి ఇన్నింగ్స్ లో న్యూజిలాండ్ బ్యాటర్లను వణికిస్తూ 88 పరుగులకే ఆ జట్టును కట్టడి చేశారు. అరంగేట్ర స్పిన్నర్ నిషాన్ పెరిస్(6/170) గింగిరాలు తిప్పే బంతులతో కివీస్ ఆటగాళ్లను ముప్పతిప్పలు పెట్టాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లోనూ మ్యాజిక్ చేస్తూ ఆరు వికెట్లతో చెలరేగాడు. ఫాలో ఆన్ అనంతరం బ్యాటింగ్కు దిగిన న్యూజిలాండ్ మూడో రోజు 121 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది.

### ఫిలిఫ్స్, బ్లండెల్ పోరాడినా..

ఇన్నింగ్స్ మొదలెట్టిన కాసేపటికే ఆలౌట్ ప్రమాదంలో పడిన జట్టును ఆల్రౌండర్ గ్లెన్ ఫిలిఫ్స్(78), వికెట్ కీపర్ టామ్ బ్లండెల్(60)తో కలిసి ఆదుకున్నాడు. దాంతో, నాలుగో రోజుకు వెళ్లింది. లంక బౌలర్లను విసిగిస్తూ అర్ధ శతకాలు బాదిన ఈ ఇద్దరిని నిషాన్ డగౌట్కు పంపాడు.

ఆ తర్వాత హాఫ్ సెంచరీతో మెరిసిన మిచెల్ శాంట్నర్(67)ను సైతం ఔట్ చేసి ఆరో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు ప్రభాత్ జయ సూర్య (3/139) సైతం మూడో వికెట్లతో పర్యాటక జట్టు పతనాన్ని శాసిం చాడు. దాంతో, న్యూజిలాండ్ 360కే ఆలౌట్ అయి ఇన్నింగ్స్ 154 పరుగుల భారీ ఓటమి మూటగట్టుకుంది.

### శతక త్రయం.. బౌలర్ల ద్వయం

రెండో టెస్టులో శ్రీలంక బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. మూడింటా అదరగొట్టింది. మొదట ఓపెనర్ దినేశ్ చండిమల్(116) శతకంతో భారీ స్కోర్కు బాటలు వేశాడు. అనంతరం కమిందు మెండిస్(182 నాటౌట్ : 250 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్సర్లు), కుశాల్ మెండిస్ (106 నాటౌట్)లు ఆకాశమే హద్దుగా న్యూజిలాండ్ బౌలర్లను ఉతికేశారు. బౌండరీలతో విరుచుకుపడి లంక స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలోనే కమిందు టెస్టుల్లో 1,000 పరుగుల మైలురాయికి చేరుకొని చరిత్ర సృష్టించాడు. కేవలం 13 ఇన్నింగ్స్‌లోనే వెయ్యి క్లబ్లో చేరి క్రికెట్ లెజెండ్ బ్రాడ్మన్ రికార్డును సమం చేశాడు. చండిమల్, కమిందు, కుశాల్ భారీ శతకాలతో కొండంత స్కోర్ కొట్టిన లంక 602-5 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

## 40 ఎకరాల్లో కొత్త ఎన్‌సీఏ.. ప్రారంభించిన బీసీసీఐ!




బెంగళూరులో కొత్తగా నిర్మించిన జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్సీఏ)ని భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) అధ్యక్షుడు రోజర్ బిన్నీ ప్రారంభించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి బీసీసీఐ సెక్రటరీ జై షాతో పాటు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా హాజరయ్యారు. ఆధునాతన హంగు లతో పాటు ప్రపంచస్థాయి సదుపాయాలతో ఈ స్టేడియాన్ని నిర్మించారు. 24 ఏళ్ల క్రితం 2000ల్లో ఎన్సీఏను బీసీసీఐ ప్రారంభించింది. అప్పటి నుంచి చిన్నస్వామి స్టేడియం ప్రాంగణంలోనే ఎన్సీఏ నడుస్తోంది. ఇది సరిపోకపోవడంతో బీసీసీఐ.. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్న 40 ఎకరాల్లో కొత్త ఎన్సీఏను నిర్మించారు. ఇందులో మూడు ప్రపంచస్థాయి మైదానాలు, ఇండోర్, ఔట్‌డోర్ సహా మొత్తం 86 పిచ్లను ఏర్పాటు చేశారు. ఒలింపిక్ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్, జిమ్, రీహాబిలిటేషన్ సెంటర్లను కూడా నిర్మించారు. నూతనంగా నిర్మించిన ఈ మైదానాలు ఇంగ్లండ్ కౌంటీ మైదానాలను తలపించేలా ఉన్నాయి. నూతన ఎన్సీఏలో నిర్మించిన మూడు మైదానాల్లో ప్రధానమైనది గ్రౌండ్ ఏ. ముంబై ఎర్ర మట్టి పిచ్లతో ఆధునాతన ప్రసార సౌకర్యాలతో తీర్చిదిద్దారు. అలాగే గ్రౌండ్ బీ, సీ మైదానాలను ఆటగాళ్లు ప్రాక్టీస్ చేసుకునేందుకు అణవుగా కట్టారు. ఇందులో 11 మాండయా మట్టి పిచ్లతో పాటు ఒడిశా నుంచి తెచ్చిన తొమ్మిది నల్ల కాటన్ మట్టి పిచ్లు ఉన్నాయి. అంతేకాకుండా ఆధునాతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వర్షం పడినప్పుడు ఆటకి అంతరాయం కలగకుండా ఈ పిచ్లు త్వరగా సిద్ధమవుతాయి. వీటితో పాటు 45 ఔట్డోర్ నెట్ ప్రాక్టీస్ పిచ్లను కూడా ఏర్పాటు చేశారు. యూకే, ఆస్ట్రేలియా నుంచి ప్రీమియం టర్ఫ్‌తో 8 పిచ్‌లను సిద్ధం చేశారు. ఇంటిగ్రేటెడ్ కెమెరాలు, సహజ కాంతి కోసం గాజు పలకలు, అతి పెద్ద జిమ్, 3 వేల స్క్వేర్ యార్డ్స్‌లో అతి పెద్ద డ్రెస్సింగ్ రూంలను నిర్మించారు.

## ఆరోపణలకు ఆధారాల్లేవు.. వాళ్లే నాపట్ల వివక్ష చూపించారు



భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష తనపై వస్తున్న ఆరోపణలను ఖండించింది. తనది నియంతృత్వ ధోరణి అంటూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి లేఖ రాసిన 12 బంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులపై ఆమె మండిపడింది. వాళ్లు తనపై చేస్తున్నవి ఉత్త ఆరోపణలే అని, అందుకు ఆధారాలు లేవని ఉష తెలిపింది. అంతేకాదు ఎగ్జిక్యూటివ్ సభ్యుల్లో కొందరు అవినీతికి పాల్పడ్డారని, లింగ వివక్ష చూపించారని, వాళ్లలో కొందరిపై లైంగిక వేధింపుల కేసులు కూడా నమోదు అయ్యాయని ఉష వెల్లడించింది.

ఎగ్జిక్యూటివ్ కమిటీ సీఈవోగా రఘురామ్ అయ్యర్ నియామకంపై భిన్న వాదనల నేపథ్యంలో ఉష తీరును సభ్యులు తప్పు పట్టారు. ఆమెది నిరంకుశ ధోరణి, నియంతృత్వ పోకడ అంటూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ జెరొమె పొయివేకు 12 మంది సభ్యులు లేఖ రాశారు. అయితే.. వాళ్లు తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని పీటీ ఉష అంటోంది. సీఈఓగా రఘురామ్ అయ్యర్ ఎన్నికపై తాము రెండు సార్లు సమావేశం అయ్యామని.. అయితే రెండు వర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని ఆమె అంది.

అంతేకాదు ఆ మీటింగ్స్ను ఉద్దేశపూర్వకంగానే బోర్డు సభ్యులు రికార్డ్ చేయలేదని ఉష ఆరోపిస్తోంది. 'నా 45 ఏండ్ల క్రీడా జీవితంలో ఎన్నో అంతర్జాతీయ వేదికలపై, ఎన్నో పోటీల్లో భారత దేశ ప్రతినిధిగా వ్యవహరించాను. అయితే.. మన అథ్లెట్లు, మన దేశ క్రీడా భవిష్యత్తు గురించి కాకుండా ఇతర విషయాలు మాటాడేవాళ్లను నేనెప్పుడు కలవలేదు' అని ఉష ఈసీ సభ్యుల తీరును దుయ్యబట్టింది.

### ఆ ఫొటోతో విమర్శలు

పారిస్ ఒలింపిక్స్ సమయంలోనూ ఉష తీరుపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. అనర్హతకు గురైన రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌ను ఆస్పత్రిలో పరామర్శించిన ఆమె ఆ తర్వాత.. 'బరువు అనేది క్రీడాకారుల బాధ్యత' అంటూ కామెంట్ చేసింది. దాంతో, ఆమెపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. అందుకు వినేశ్ సైతం గట్టిగానే బదులిచ్చింది. తనతో బలవంతంగా ఓ ఫొటో దిగి.. దాన్ని సోషల్ మీడియాలో పెట్టి రాజకీయం చేశారని మాజీ రెజ్లర్ ఉషను ఉద్దేశించి కౌంటర్ ఇచ్చింది.

## లెజెండరీ హీరోయిన్‌తో తృప్తి డిమ్రి సినిమా..



యానిమల్ సినిమాతో ఓవర్‌నైట్ స్టార్ డమ్ సంపాదించింది ఉత్తారఖండ్ భామ తృప్తి డిమ్రి. హాట్ హాట్‌గా అందాలు ఆరబోస్తూ టాక్ ఆఫ్ ది గ్లోబల్ ఇండస్ట్రీగా నిలిచింది. ఇటీవలే బ్యాడ్ న్యూజ్ సినిమాతో మరో హిట్‌ను ఖాతాలో వేసుకుంది. బడా దర్శకనిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయిన ఈ ముద్దుగుమ్మ మరో భారీ ప్రాజెక్టుకు సంతకం చేసిందన్న వార్త ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. యానిమల్ బ్యూటీ బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ మాధురీ దీక్షిత్‌తో సినిమా చేసేందుకు సైన్ చేసిందని బీటౌన్ సర్కిల్ సమాచారం. ఈ చిత్రాన్ని జల్సా అండ్ తుమ్హారీ సులు ఫేం విక్రమ్ మల్హోత్రా డైరెక్ట్ చేయబోతున్నాడు. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో ఉండబోతున్న ఈ చిత్రంలో మాధురీ దీక్షిత్ తృప్తి డిమ్రి తల్లి పాత్రలో కనిపించనుందట. ఈ ఏడాది చివరలో షూటింగ్ షురూ కానుండగా.. 2025 వేసవి కానుగా విడుదలకు ప్లాన్ చేస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్.

## 'ఐఫా'లో 'యానిమల్' హవా.. ఉత్తమ నటుడిగా షారుక్

భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) అవార్డుల కార్యక్రమం వేడుకగా జరిగింది. అబుదాబి వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో తొలిరోజు దక్షిణాది చిత్రపరిశ్రమకు చెందిన సినిమాలు, సినీ ప్రముఖులకు అవార్డులు అందించారు. రెండో రోజు బాలీవుడ్ సినిమాలకు, నటీ నటులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో 'యానిమల్' హవా కనిపించింది. వివిధ విభాగాల్లో అవార్డులు సొంతం చేసుకుంది. 'జవాన్' చిత్రానికి షారుక్ ఖాన్ ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్నారు.



### ఐఫా 2024 విజేతలు వీరే:

ఉత్తమ చిత్రం: యానిమల్
ఉత్తమ నటుడు: షారుక్ ఖాన్ (జవాన్)
ఉత్తమ నటి: రాణీ ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే)
ఉత్తమ దర్శకుడు: విదు వినోద్ చోప్రా (12 ఫెయిల్)
ఉత్తమ సహాయ నటుడు: అనిల్ కపూర్ (యానిమల్)
ఉత్తమ సహాయ నటి: షబానా అజ్మీ (రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ )
ఉత్తమ విలన్: బాబీ దేవోల్ (యానిమల్)
ఉత్తమ కథ: రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ
ఉత్తమ కథ (అడాప్టెడ్): 12 ఫెయిల్
ఉత్తమ సంగీతం: యానిమల్
ఉత్తమ లిరికల్స్: యానిమల్ (సిద్ధార్థ్-గరిమే, సత్రన్యాగ)
ఉత్తమ గాయకుడు: భూపిందర్ బబ్బల్, అర్జన్ వ్యాలీ (యానిమల్)
ఉత్తమ గాయని: శిల్పారావు (చెలియా-జవాన్)
ఔట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఆఫ్ ఇండియన్ సినిమా: జయంతిలాల్, హేమా మాలిని
అచీవ్‌మెంట్ ఆన్ కంప్లీటింగ్ 25 ఇయర్స్ ఇన్ సినిమా : కరణ్ జోహార్

## రామ్‌చరణ్‌కు అరుదైన గౌరవం..



నటుడు రామ్‌చరణ్ అరుదైన గౌరవం దక్కించుకున్నారు. ప్రతిష్ఠాత్మక మేడమ్ టుస్సాడ్స్‌లో ఆయన మైనపు విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. సింగపూర్‌లోని మ్యూజియంలో చరణ్‌తో పాటు ఆయన పెంపుడు శునకం రైమీ విగ్రహాన్ని కూడా పెట్టనున్నారు. దీనికి సంబంధించిన ఫొటోషూట్ ఇప్పటికే పూర్తయింది. త్వరలోనే చరణ్ మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. టుస్సాడ్స్ టీమ్ ఐఫా వేదికగా ఈ విషయాన్ని తెలియజేసింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ''టుస్సాడ్స్ కుటుంబంలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నా'' అని చరణ్ పేర్కొన్నారు. దీనిపై హీరో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టాలీవుడ్‌కు చెందిన ప్రభాస్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్ మైనపు విగ్రహాలు మేడమ్ టుస్సాడ్స్‌లో కొలువుదీరిన విషయం తెలిసిందే.

## శారీలో శ్రద్ధా శ్రీనాథ్ మెరుపులు..

నందమూరి బాలకృష్ణ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఎన్బీకే 109. బాబీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ టైటిల్‌ను దసరా కానుకగా ప్రకటించబోతున్నారని ఇప్పటికే ఓ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా, శ్రద్ధాశ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. తాజాగా శ్రద్ధాశ్రీనాథ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ లుక్ విడుదల చేశారు. ఎరుపు రంగు స్లీవ్‌లెస్ టాప్ మ్యాచింగ్ శారీలో ధగ ధగ మెరిసిపోతున్న స్టిల్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఇంతకీ ఈ భామ ఎన్బీకే 109లో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది సస్పెన్స్ నెలకొంది.




Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A, Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana. , **EDITOR: VUPPARI RAMESH KUMAR**. **RNI Reg No.TELTEL/2016/72952**.